RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

వరంగల్ | సంపుటి: 4 సంచిక:134 | శుక్రవారం మే 22, 2026 | పేజీలు 8 | వెల: రూ.3-00

లింగబత్తిని కృష్ణ
సీఎండీ & ఎడిటర్
9701923260

దినపత్రిక



## అప్పుల్లో పుట్టి.. అప్పుల్లోనే రైతు జీవితం!

మరణించినా మాఫీ కాని క్రాప్ లోన్లు 6లో

### కులగణనలో తెలంగాణ

# దేశానికే దిక్సూచి

## దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

- తెలంగాణ నిర్ణయానికి న్యాయస్థానం మద్దతు
- బలహీన వర్గాలకు న్యాయం చేసే దిశగా ముందడుగు
- సమగ్ర సమాచారంతో సంక్షేమ పథకాల అమలు
- సుప్రీంకోర్టు నిర్ణయంపై సీఎం రేవంత్ రెడ్డి హర్షం

2లో






# బండి.. ఉక్కిరిబిక్కిరి!

- ఓ వైపు కొడుకు చేసిన ఘనకార్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- మరోవైపు మంత్రి పదవి ఊడుతుందంటూ ప్రచారం..
- కొత్త పార్టీ పెడుతుండంటూ కోడై కూసిన సోషల్ మీడియా
- అనుచరులతో బీజేపీ కార్యాలయంలో హంగామా వెనుక మర్మమేంటి?
- మంత్రి పదవికి ఉద్వాసన తప్పదనే సంకేతాలా..?
- చివరి శ్వాస వరకూ బీజేపీలోనే అంటూ వివరణ ఇచ్చిన సంజయ్
- ఇదంతా కేటీఆర్ మీడియా చేస్తున్న దుష్ప్రచారం అంటూ ఫైర్
- భగీరథ్‌కు బిగుస్తున్న పోక్సో ఉచ్చు.. తండ్రికేమో పదవీ గండం అంటూ ప్రచారం..

2లో

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణ బీజేపీలో సాగుతున్న హైడ్రామా ఇప్పుడు క్లైమాక్స్‌కు చేరింది. కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడంతో తీవ్ర రక్షణలో పడ్డ కేంద్ర మంత్రి బండి సంజయ్ చుట్టూ ఇప్పుడు రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ఒకవైపు ఆయన మంత్రి పదవి ఊడుతుందనే ప్రచారం సాగుతుండగా, మరోవైపు రాష్ట్ర అధ్యక్షుడు ఢిల్లీ వెళ్లిన సమయం చూసి సంజయ్ వందలాది మంది అనుచరులతో పార్టీ ఆఫీసులో బల ప్రదర్శనకు దిగారని ప్రచారం జరగడం హాట్ టాపిక్‌గా మారింది. తనపై వేటు వేస్తే పార్టీకి నష్టం జరుగుతుందనే సిగ్నల్స్ పంపడానికే బండి ఈ హడావుడి చేశారనే విమర్శలు వస్తున్నాయి. ఇదే తరుణంలో తాను కొత్త పార్టీ పెడుతున్నానంటూ వస్తున్న వార్తలపై బండి సంజయ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. చనిపోయాక తన భౌతిక దేహంపై బీజేపీ జెండా మాత్రమే కప్పాలని, ఇదంతా కేటీఆర్ మీడియా చేస్తున్న కుట్రపూరిత ప్రచారమని కొట్టిపారేశారు. చట్టాన్ని గౌరవించి కొడుకును పోలీసులకు అప్పగించిన ఏకైక నేతను నేనేనని స్పష్టం చేశారు. మరి ఈ అగ్నిపరీక్షలో బీజేపీ బండి సంజయ్‌ను కాపాడుకుంటుందా లేక పక్కన పెడుతుందా అనేది రానున్న రోజుల్లో తేలనుంది.

## కార్మికులకు శుభవార్త


### కనీస వేతనాల్లో భారీ పెంపు

- జూన్ 1 నుంచి కొత్త వేతనాలు అమలు
- కోటి మందికిపైగా కార్మికులకు లాభం
- నాలుగు విభాగాలుగా కార్మికుల వర్గీకరణ
- గ్రామీణ–పట్టణ ప్రాంతాలకు ప్రత్యేక విధానం
- ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయం
- విదేశీ ఉద్యోగాలకు ప్రత్యేక శిక్షణ
- కార్మిక సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబాటు

2లో



## వైభవంగా సరస్వతి పుష్కరాలు ప్రారంభం



- తొలి పుష్కర స్నానానికి విశేష స్పందన
- పవిత్ర పుణ్యస్నానంలో పాల్గొన్న ప్రముఖులు
- భక్తులతో కిక్కిరిసిన పుష్కర ఘాట్‌లు
- పోలీసు, వైద్య సేవలతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**వేద న్యూస్, పెద్దపల్లి**

సరస్వతి అంత్య పుష్కరాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజే భక్తులతో పుష్కర ఘాట్‌లు కిక్కిరిసిపోయాయి. ఉదయం 5 గంటల 43 నిమిషాలకు పవిత్ర సంగమంలో తొలి పుష్కర స్నానం నిర్వహించారు. వేద మంత్రాలు, పూజా కార్యక్రమాల నడుమ ఆధ్యాత్మిక వాతావరణంలో పుష్కరాలు ప్రారంభమయ్యాయి. తొలి పుణ్యస్నాన కార్యక్రమంలో కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వాములు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కుటుంబ సభ్యులతో కలిసి పుష్కర స్నానం ఆచరించగా, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు గోవింద హరి, ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణ రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలి రోజు నుంచే భారీ సంఖ్యలో భక్తులు

మిగతా 2వ పేజీలో

## ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం

అర్హులందరికీ భూ పట్టాలు అందిస్తాం
ప్రజా దర్బార్‌లో పొంగులేటి హామీ



2లో

### బీఆర్ఎస్ సభ్యత్వానికి

# డిజిటల్ కసరత్తు!

- నియోజకవర్గాలకు ఇంఛార్జీల నియామకం
- డిజిటల్ శిక్షణకు తెలంగాణ భవన్ సిద్ధం
- సభ్యత్వ నమోదు ప్రక్రియకు ఏర్పాట్లు

2లో

BHARAT RASHTRA SAMITHI
BRS
భారత రాష్ట్ర సమితి

వేద న్యూస్



# వెల్‌కమ్ టు.. మిల్స్ కాలనీ!

## కొత్త సీఐగా బాధ్యతలు స్వీకరించిన కర్రే స్వామి



- స్టేషన్ పరిధిలో యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలు
- పట్టిపీడిస్తున్న గంజాయి, మద్యం మహమ్మారి
- కుప్పలుతెప్పలుగా బెల్ట్ షాపులు
- రెచ్చిపోతున్న భూకబ్జాదారులు
- స్టేషన్‌లో అడుగుపెట్టాలంటే పలుకుబడి ఉండాలనే భయం..
- కొత్త సీఐ పరిస్థితిని మార్చబోతున్నారా?
- అసాంఘిక శక్తులకు చెక్ పెడతారా?
- ఆశగా ఎదురుచూస్తున్న ప్రజలు

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కొత్త సారథి వచ్చారు. మిల్స్ కాలనీ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా కర్రే స్వామి బాధ్యతలు చేపట్టారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన క్షణం నుంచే స్థానిక ప్రజల్లో, బాధితుల్లో ఒక కొత్త ఆశ చిగురించింది. అయితే, కొత్త సీఐకి పదవీ బాధ్యతలు ఎంత ప్రతిష్టాత్మకమో.. క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితులు, సవాళ్లు అంతకంటే ఎక్కువగా ఉన్నాయి. మిల్స్ కాలనీ పరిధిలో ప్రస్తుతం నెలకొన్న శాంతిభద్రతల సమస్యలు, అసాంఘిక శక్తుల ఆగడాలను అణచివేయడం నూతన సీఐ ముందున్న అత్యంత ప్రధానమైన టాస్క్‌గా కనిపిస్తోంది.

**కుప్పలు తెప్పలుగా బెల్ట్ షాపులు..**

మిల్స్ కాలనీ పరిధిలో ప్రస్తుతం స్థానిక ప్రజలను తీవ్రంగా వేధిస్తున్న సమస్య.. విచ్చలవిడిగా వెలిసిన బెల్ట్ షాపులు. నిబంధనలకు విరుద్ధంగా గల్లీకో బెల్ట్ షాపు వెలిసి, అర్ధరాత్రి దాటినా మద్యం విక్రయాలు సాగిస్తూ అల్లర్లకు కారణమవుతున్నాయి. ఈ మద్యం మత్తు చాలదన్నట్లు, ఇటీవల కాలంలో గంజాయి సంస్కృతి కూడా ఇక్కడ వేగంగా విస్తరిస్తోంది. పదుల సంఖ్యలో యువత, విద్యార్థులు గంజాయి, మద్యం మత్తుకు బానిసలై తమ భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారు. మత్తులో గ్యాంగులుగా ఏర్పడి, చిన్న చిన్న విషయాలకే గొడవలకు దిగుతూ స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్నారు. ఈ మత్తు నెట్‌వర్క్‌ల




వేళ్లను కట్ చేయడం కొత్త సీఐ కు పెద్ద సవాల్‌గా మారనుంది.

**దర్జాగా భూకబ్జాదారుల ఆగడాలు**

మిల్స్ కాలనీ ఏరియాలో భూకబ్జాదారుల ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. అమాయకుల స్థలాలను, వివాదాస్పద భూములను టార్గెట్ చేస్తూ.. రాజకీయ, రౌడీ పలుకుబడితో భూబకాసురులు దర్జాగా కబ్జాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. తిరగబడితే బెదిరింపులకు దిగుతుండటంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వీటికి తోడుగా కాలనీలోని కొన్ని ప్రాంతాలు గుట్టుచప్పుడు కాకుండా సాగే జూదం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయనే విమర్శలు వస్తున్నాయి.

**స్టేషన్‌లో అడుగుపెట్టాలంటే పలుకుబడి ఉండాలా?**

సాధారణంగా పోలీస్ స్టేషన్ అంటే సామాన్యుడికి న్యాయం జరిగే దేవాలయం కావాలి. కానీ, మిల్స్ కాలనీ పరిధిలో ఉన్న పరిస్థితుల వల్ల ప్రజల్లో ఒక బలమైన అపోహ ఏర్పడింది. స్టేషన్‌లో అడుగుపెట్టాలన్నా, తాము పడుతున్న ఇబ్బందులపై ఫిర్యాదు చేయాలన్నా ఏదైనా రాజకీయ బ్యాక్‌గ్రౌండ్ లేదా పెద్దల పలుకుబడి ఉండాలనే భయం ప్రజల్లో నెలకొంది. కిందిస్థాయి సిబ్బంది వైఖరి వల్లో లేదా పాత పద్ధతుల వల్లో సామాన్యుడు నేరుగా వచ్చి ఫిర్యాదు చేసేందుకు జంకుతున్న పరిస్థితి ఉంది.

### కొత్త సీఐపైనే ప్రజల ఆశలు..

**ఈ నేపథ్యంలో బాధ్యతలు చేపట్టిన నూతన సీఐ కర్రే స్వామిపై మిల్స్ కాలనీ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆయన గతంలో పనిచేసిన ప్రాంతాల్లో ఉన్న మంచి ట్రాక్ రికార్డును గుర్తుచేసుకుంటున్న బాధితులు.. కచ్చితంగా ఈ కొత్త సారథి కాలనీలో మార్పు తెస్తారని నమ్ముతున్నారు. మిల్స్ కాలనీకి 'ఫ్రెండ్లీ పోలీసింగ్' నమ్మకాన్ని ఇస్తూనే.. నేరగాళ్ల పట్ల 'స్ట్రాంగ్ పోలీసింగ్' వైఖరిని అవలంబించి, ఇక్కడి సమస్యల వలయాన్ని ఛేదిస్తారని ప్రజలు గట్టిగా ఆశిస్తున్నారు.**

## రాజీవ్ ఆశయాలను కొనసాగిద్దాం

### కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు గోపాల నవీన్ రాజ్



**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

కొండా దంపతుల ఆదేశం మేరకు వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఎంజీఎం జంక్షన్లో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్ రాజ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గోపాల నవీన్ రాజ్ మాట్లాడుతూ.. స్వర్గీయ రాజీవ్ గాంధీ భారతదేశం కోసం ప్రాణ త్యాగం చేసిన గొప్ప మహనీయుడని కొనియాడారు. 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించిన గొప్ప నాయకుడని అన్నారు. నేరుగా గ్రామాలకు పట్టణాలకు అభివృద్ధి చేసేందుకు నిధులు పంపిన గొప్ప మేధావి అని అన్నారు. రాజీవ్ గాంధీ ఆశయాలను కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పుల్ల పద్మావతి భాస్కర్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్, కొత్తపెల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు మబ్బు ప్రవీణ్, సయ్యద్ వసీం, ఈనాయత్ అక్తర్, భాష పాక సదానందం, మాజీ కార్పొరేటర్లు కత్తెరశాల వేణుగోపాల్, జారతి రమేష్, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, బైరబోయిన దామోదర్ యాదవ్,వస్కుల బాబు, బాల్నేసురేష్, పోశల పద్మ, కావేటి కవిత, ముష్కమల అరుణ సుధాకర్, భోగి సువర్ణ సురేష్, పల్లం పద్మా రవి, ఎలగం సత్యనారాయణ,కాంగ్రెస్ నాయకులు సందేల లాజర్, క్యాతం రవీందర్, దాసరి రాజేష్, దామెర రాజ్ కమల్, చిప్ప వెంకటేశ్వర్లు, లక్కిరెడ్డి పూర్ణిందర్ రెడ్డి, గొండా శ్రీనివాస్, జన్ను జీవన్, జంగం ప్రభాకర్, కూచన రవీందర్, గజ్జల శ్యామ్, పగడాల సతీష్, శ్రీరాం రాజేష్, మంజిత్ సింగ్, పోలేపాక సుధాకర్, మహేష్, సంగరాబోయిన చందర్, బట్టు శేషు, తదితరులు పాల్గొన్నారు.

## కులగణనలో తెలంగాణ దేశానికే దిక్సూచి

**వేద న్యూస్, హైదరాబాద్**

జనగణనలో కులగణన అంశాన్ని చేర్చడంలో తెలంగాణ దేశానికి దశ, దిశ చూపించిన రాష్ట్రంగా నిలిచిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జనాభా లెక్కల్లో కులగణన అంశాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు నిర్ణయం నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా తక్షణమే కులగణన చేపట్టాలని ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర కుల సర్వే నిర్వహించి సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలకు సంబంధించిన వివరాలను సేకరించిందని గుర్తుచేశారు. బలహీన వర్గాల్లో నెలకొన్న అభద్రతా భావాన్ని తొలగించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. కులగణన అంశాన్ని సుప్రీంకోర్టు సమర్థించడం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి మరింత బలం చేకూర్చిందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం పరోక్షంగా సమర్థించడం రాష్ట్రానికి దక్కిన గౌరవమని సీఎం పేర్కొన్నారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే ప్రయత్నం తెలంగాణ ప్రభుత్వం చేసిందన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా తెలంగాణ ముందడుగు వేసిందని, దేశవ్యాప్తంగా కూడా ఇలాంటి చర్యలు చేపడితే బలహీన వర్గాల అభివృద్ధికి మరింత తోడ్పాటు అందుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. సమగ్ర సమాచారంతో సంక్షేమ విధానాలు మరింత సమర్థవంతంగా అమలు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు.

## కార్మికులకు శుభవార్త

**వేద న్యూస్, హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలోని కోటి పదకొండు లక్షల మంది కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కార్మికుల కనీస వేతనాలను పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. పెంచిన వేతనాలు జూన్ 1 నుంచి అమల్లోకి రానున్నాయని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో కార్మిక ఉపాధి శిక్షణ శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి ఈ ప్రకటన చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కార్మిక సంక్షేమం కోసం తీసుకున్న కీలక నిర్ణయాల్లో ఇదొకటని పేర్కొన్నారు. రాష్ట్రంలోని కార్మికులను నైపుణ్యాల ఆధారంగా నాలుగు విభాగాలుగా వర్గీకరించినట్లు సీఎం తెలిపారు. నైపుణ్యం లేని కార్మికులు, అర్ధనైపుణ్యం కలిగిన వారు, నైపుణ్యం కలిగిన వారు, అత్యంత నైపుణ్యం కలిగిన వారు అనే విభాగాలుగా విభజించి వేతనాలు నిర్ణయించినట్లు వెల్లడించారు. గతంలో అమల్లో ఉన్న రెండు ప్రాంతాల విధానాన్ని మార్చి, ఇప్పుడు మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల ఆధారంగా మూడు జోన్ల విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. నైపుణ్యం లేని కార్మికుల కనీస వేతనం రూ.12,750 నుంచి రూ.16,000కు పెంచినట్లు చెప్పారు. అర్ధనైపుణ్యం కలిగిన కార్మికుల వేతనం రూ.13,592 నుంచి రూ.17,000కు పెరిగిందన్నారు. నైపుణ్యం కలిగిన కార్మికులకు రూ.18,500, అత్యంత నైపుణ్యం కలిగిన కార్మికులకు రూ.20,000 వరకు వేతనాలు నిర్ణయించినట్లు వెల్లడించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా కోటి మందికిపైగా కార్మికులు నేరుగా లబ్ధి పొందనున్నారని పేర్కొన్నారు. విదేశాలకు వెళ్లే నైపుణ్యం కలిగిన కార్మికులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ముఖ్యంగా గల్ఫ్, పశ్చిమాసియా దేశాలకు వెళ్లే వారికి అవసరమైన శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించే ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కార్మికులు మధ్యవర్తుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేసిన సీఎం, విదేశాల్లో ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందిస్తున్నామని గుర్తుచేశారు.

## వైభవంగా సరస్వతి పుష్కరాలు ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. కుటుంబ సభ్యులతో కలిసి తర్పణాలు, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆధ్యాత్మిక వేడుకల్లో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఘాట్‌ల వద్ద ప్రత్యేక భద్రత, తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, విశ్రాంతి కేంద్రాలు, రవాణా సౌకర్యాలు కల్పించారు. అత్యవసర సేవల కోసం అంబులెన్స్‌లు, వైద్య బృందాలు సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. పుష్కరాల సమయంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, భక్తులు ప్రశాంతంగా పుష్కర స్నానాలు ఆచరించేలా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. రానున్న రోజుల్లో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

# బండి.. ఉక్కిరిబిక్కిరి!




- ఓ వైపు కొడుకు చేసి ఘనకార్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు
- మరోవైపు మంత్రి పదవి ఊడుతుందంటూ ప్రచారం..
- కొత్త పార్టీ పెడుతుండంటూ కోడై కూసిన సోషల్ మీడియా
- అనుచరులతో బీజేపీ కార్యాలయంలో హంగామా వెనుక మర్మమేంటి?
- మంత్రి పదవికి ఉద్వాసన తప్పదనే సంకేతాలా..?
- చివరి శ్వాస వరకూ బీజేపీలోనే అంటూ వివరణ ఇచ్చిన సంజయ్
- ఇదంతా కేటీఆర్ మీడియా చేస్తున్న దుష్ప్రచారం అంటూ ఫైర్
- భగీరథ్ కు బిగుస్తున్న పోక్సో ఉచ్చు.. తండ్రికేమో పదవీ గండం అంటూ ప్రచారం..

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**

తెలంగాణ బీజేపీలో గత కొన్ని రోజులుగా నడుస్తున్న హైడ్రామా ఇప్పుడు పతాక స్థాయికి చేరింది. కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం, అది కాస్తా దేశవ్యాప్తంగా సంచలనంగా మారడంతో తీవ్ర రక్షణలో పడ్డాడు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్. ఒకవైపు ఈ కేసు కారణంగా బండి సంజయ్‌కు కేంద్ర మంత్రి పదవి నుంచి ఉద్వాసన తప్పదనే ప్రచారం ఢిల్లీ నుంచి గల్లీ వరకు గట్టిగా సాగుతుండగా.. మరోవైపు తనపై వస్తున్న ఊహాగానాలను తిప్పికొట్టేందుకు, పార్టీ అధిష్ఠానానికి తన పట్టు ఏంటో చూపించేందుకు బండి సంజయ్ వ్యూహాత్మకంగా అడుగులు వేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

**అధ్యక్షుడు లేని సమయంలో బల ప్రదర్శన అంటూ..**

కొడుకు పోక్సో కేసు విషయంలో బండి సంజయ్ వ్యవహరించిన తీరు పార్టీ ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో తీవ్రంగా దెబ్బతీసిందని హైకమాండ్ తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు రెండ్రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఇందులో భాగంగానే, ఈ ఉదంతంపై పూర్తి నివేదిక ఇవ్వాల్సిందిగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావును అధిష్ఠానం అత్యవసరంగా ఢిల్లీకి పిలిపించినట్లు వార్తలు సైతం వచ్చాయి. రాంచందర్ రావు హైకమాండ్‌కు రిపోర్ట్ ఇచ్చేందుకు ఢిల్లీ వెళ్లిన సమయాన్ని చూసుకుని.. బండి సంజయ్ తన అనుచరులు, మద్దతుదారులను భారీ సంఖ్యలో పార్టీ ఆఫీసుకు రావాలంటూ మెసేజ్‌లు పంపారనే టాక్ నడుస్తోంది. రాష్ట్ర అధ్యక్షుడు ఆఫీసులో లేని సమయంలో వందలాది మంది అనుచరులతో వచ్చి బండి సంజయ్ అక్కడ పెద్ద ఎత్తున హడావుడి చేశారని, దీని వెనుక ఒక స్పష్టమైన పొలిటికల్ స్కెచ్ ఉందనే చర్చ నడుస్తోంది. తనపై వేటు వేస్తే పార్టీకి భారీ నష్టం జరుగుతుందనే ఇండైరెక్ట్ సిగ్నల్స్ ఢిల్లీ పెద్దలకు పంపడానికే సంజయ్ ఈ 'బల ప్రదర్శన'కు దిగారని, పదవి ఊడుతుందనే భయంతోనే ఈ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారనే సోషల్ మీడియా కోడై కూస్తోంది.

**కొత్త పార్టీ పెడుతున్నారంటూ ప్రచారం**

మరోవైపు, ఒకవేళ కేంద్ర మంత్రి పదవి ఊడిపోతే లేదా పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే బండి సంజయ్ సొంతంగా కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో ఉన్నారంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జోరందుకుంది. ఈ వార్తలపై బండి సంజయ్ తీవ్రంగా మండిపడ్డారు. పార్టీ ఆఫీస్ వేదికగా తీవ్ర భావోద్వేగానికి లోనవుతూ ఆయన సంజాయిషీ ఇచ్చారు. 'నేను బీజేపీని ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించే వ్యక్తిని. చివరి శ్వాస విడిచాక నా భౌతిక దేహంపై బీజేపీ జెండా మాత్రమే కప్పాలి. నేను బీజేపీ ద్వారానే ఈ స్థాయికి వచ్చాను.. అలాంటప్పుడు నాపై ఇలాంటి ఆరోపణలు చేయడం తగదు. కొత్త పార్టీ పెట్టడం లాంటి చిల్లర మల్లర రాజకీయాలు చేసే ఆలోచన నా జీవితంలో లేదు.. నేను ఎప్పటికీ బీజేపీ కార్యకర్తనే" అని భావోద్వేగంతో వివరణ ఇచ్చారు.

**కేటీఆర్ మీడియా కుట్రే అంటూ..**

ఇదంతా కేటీఆర్ మీడియా, వారి ఫేక్ ఐడీలు చేస్తున్న కుట్రపూరిత పనేనని సంజయ్ కొట్టిపారేశారు. కేసీఆర్ కొడుకులా ఫేక్ మీడియాలు నడిపి దుష్ప్రచారం చేసే అలవాటు మాకు లేదు. గతంలో వారి గడి గోడలు బద్దలు కొట్టామనే ఫ్రస్ట్రేషన్‌తోనే మాపై బురద జల్లుతున్నారు.. వాటిని మేము పట్టించుకోము అని ఘాటుగా విమర్శించారు. తన కుమారుడి విషయంలో వస్తున్న విమర్శలకు బండి సంజయ్ కౌంటర్ ఇచ్చారు. దేశ రాజకీయాల్లో కొడుకుపై ఆరోపణలు రాగానే.. చట్టాన్ని గౌరవిస్తూ స్వయంగా పోలీసులకు అప్పగించిన ఏకైక నాయకుడిని నేనే. బండి భగీరథ్ విషయంలో నేను ఎప్పటికీ ధర్మాన్నే పాటిస్తాను. నన్ను అరెస్ట్ చేస్తారనే ప్రచారంపై నేను మాట్లాడను.. కోర్టులోనే అన్ని విషయాలు తేలుతాయి అని స్పష్టం చేశారు.

**పార్టీ అండగా ఉంటుందా?**

బండి సంజయ్‌కు సంఘీభావంగా కార్యాలయానికి చేరుకున్న భారీ సంఖ్యలో బీజేపీ శ్రేణులు.. న్యాయం గెలుస్తుంది.. సంజయ్ మా నాయకుడు అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ఆఫీస్ ప్రాంగణాన్ని హోరెత్తించారు. ఒకవైపు క్షేత్రస్థాయి కార్యకర్తలు బండి వైపు నిలబడుతున్నట్లు కనిపిస్తున్నా.. జాతీయ స్థాయిలో 'బేటీ బచావో – బేటీ పడావో' అని నినదించే బీజేపీ, ఒక కేంద్ర మంత్రి కొడుకుపై పోక్సో కేసు ఉండటాన్ని ఎంతవరకు భరిస్తుందనేది పెద్ద ప్రశ్న. మొత్తానికి కొడుకు చేసిన ఘనకార్యంతో రాజకీయంగా తీవ్ర అగ్నిపరీక్షను ఎదుర్కొంటున్న బండి సంజయ్‌ను పార్టీ కాపాడుకుంటుందా? లేక క్రమశిక్షణా చర్యల పేరిట మంత్రివర్గం నుంచి, పార్టీ నుంచి వెలివేస్తుందా? అనేది రానున్న కొన్ని రోజుల్లో తేలనుంది.

## బీఆర్‌ఎస్ సభ్యత్వానికి డిజిటల్ కసరత్తు!

**వేద న్యూస్, హైదరాబాద్**

భారత రాష్ట్ర సమితి పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను ఈసారి డిజిటల్ విధానంలో చేపట్టేందుకు సన్నాహాలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ రాష్ట్రంలోని నూట పంతొమ్మిది నియోజకవర్గాలకు ప్రత్యేక ఇంఛార్జీలను ప్రకటించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సాంకేతికంగా మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు పార్టీ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంఛార్జితో పాటు ఒక సమాచార సాంకేతిక నిపుణుడిని కూడా నియమించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తెలంగాణ భవన్‌లో వీరందరికీ ప్రత్యేక డిజిటల్ శిక్షణ అందించనున్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను సులభతరం చేయడానికి రూపొందిస్తున్న ప్రత్యేక అనువర్తనంపై కూడా వారికి అవగాహన కల్పించనున్నారు. సభ్యత్వ నమోదు కోసం రూపొందిస్తున్న డిజిటల్ అనువర్తనానికి ఇప్పటికే పలు మార్పులు, మెరుగులు చేర్చుతున్నట్లు సమాచారం. త్వరలో ఈ అనువర్తనం తుది రూపం దాల్చనుంది. సభ్యత్వ నమోదు ప్రక్రియలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు పార్టీ నాయకత్వం తెలిపింది. తెలంగాణ భవన్‌లో శిక్షణ పూర్తయిన అనంతరం ఆయా జిల్లాల్లో పార్టీ కార్యాలయాల వద్ద శిక్షణా శిబిరాలు నిర్వహించనున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు, నియోజకవర్గ ఇంఛార్జీల ఆధ్వర్యంలో ఈ శిక్షణ కొనసాగనుంది. ప్రతి నియోజకవర్గంలోని బూత్‌ల సంఖ్య ఆధారంగా బూత్‌కు ఇద్దరు చొప్పున కార్యకర్తలకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కార్యక్రమాలు వారం రోజుల పాటు కొనసాగనున్నాయి.

## ధరణి సమస్యలకు శాశ్వత పరిష్కారం

**వేద న్యూస్, ఖమ్మం**

ధరణి వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించి అర్హులైన ప్రతి ఒక్కరికీ భూ పట్టాలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలోని ఎంఆర్ గార్డెన్స్‌లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు, ధరణి వ్యవస్థలోని లోపాల కారణంగా రైతులు, పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని మంత్రి పేర్కొన్నారు. ఈ సమస్యలకు పరిష్కారంగా రైతులకు అప్పుడిలా నిలిచే భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. గతంలో భూ రికార్డులు కొంతమంది ఆధీనంలో ఉండేవని, ఇప్పుడు భూములపై పేదలకు పూర్తి హక్కులు కల్పించే దిశగా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని చెప్పారు. జూన్ రెండో తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత మంజూరు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

వేద న్యూస్

శుక్రవారం మే 22, 2026

# అజాగ్రత్త డ్రైవింగ్‌తో బాలిక మృతి..

**– నిందితుడికి 6 నెలల జైలు శిక్ష**

**వేద న్యూస్, కోరుట్ల:**

అతివేగంగా, అజాగ్రత్తగా వాహనం నడిపి ఐదేళ్ల చిన్నారి మృతికి కారణమైన నిందితుడికి కోరుట్ల జేఎఫ్‌సీఎం కోర్టు ఆరు నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.500 జరిమానా విధించింది. పోలీసుల వివరాల ప్రకారం.. 2019 ఫిబ్రవరి 19న ఆకుల బోజన్న తన మనుమరాలు ధరిణితో కలిసి టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై పైడిమడుగు గ్రామం నుంచి వస్తుండగా, కల్లూరు వైపు నుంచి వచ్చిన ట్రాక్టర్‌ను పోగుల భూమయ్య అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి వారి వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో చిన్నారి ధరిణి తలకు తీవ్ర గాయాలు కావడంతో ఘటనాస్థలంలోనే మృతి చెందగా, బోజన్నకు తీవ్ర గాయాలయ్యాయి. బాలిక తండ్రి ఆకుల నరేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి పావని, నిందితుడిపై నేరం రుజువుకావడంతో 6 నెలల కఠిన కారాగార శిక్షతో పాటు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

# ముమ్మరంగా పెన్షన్ ఈ-కేవైసీ ప్రక్రియ

**– లబ్ధిదారులకు ప్రత్యేక కేంద్రాల ఏర్పాటు**

**వేద న్యూస్, చొప్పదండి:**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పెన్షన్ లబ్ధిదారుల ముఖచిత్ర ధ్రువీకరణ ఈ-కేవైసీ ప్రక్రియ చొప్పదండి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో ముమ్మరంగా కొనసాగుతోంది. 13వ వార్డు కౌన్సిలర్ జిట్ట మంగ కుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా వార్డు పరిధిలోనే ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ప్రతిభ స్కూల్, మరిమడ్లవాడ ప్రాంతాల్లో ప్రత్యేక ఈ-కేవైసీ కేంద్రాలు నిర్వహించారు. ఈ కేంద్రాలకు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పెద్ద సంఖ్యలో హాజరై తమ ధ్రువీకరణ ప్రక్రియ పూర్తి చేసుకున్నారు. సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా వార్డు సిబ్బంది సహాయం అందిస్తూ ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ జిట్ట మంగ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 16 నుంచి జూన్ 15 వరకు ఈ-కేవైసీని తప్పనిసరి చేసిందని తెలిపారు. లబ్ధిదారులు ఇతర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బంది



పడకుండా వార్డులోనే ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. జూన్ 15లోపు ప్రతి పెన్షన్ లబ్ధిదారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ కొమురయ్య, ఇమ్రాన్, సహాయక సిబ్బంది, కాలనీ పెద్దలు, మహిళలు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా పైనంపల్లి గ్రామంలో గ్రామ కేంద్రంలో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుక్కల నరేష్ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశంలో కంప్యూటర్, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి పునాది వేశారని, యువతకు అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు ఓటు హక్కు కల్పించిన ఘనత కూడా రాజీవ్ గాంధీకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీకి ఘన నివాళులు



**– పరకాలలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో వర్ధంతి**

**వేద న్యూస్, పరకాల ప్రతినిధి:**

భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పరకాల మండల, పట్టణ అధ్యక్షుల ఆధ్వర్యంలో పరకాల క్యాంపు కార్యాలయంలో ఘనంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతకు ఓటు హక్కు కల్పించడంతో పాటు దేశంలో ఐటీ రంగానికి పునాది వేసి భారత ముఖచిత్రాన్ని మార్చిన మహోన్నత నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్త దేశ సేవలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చిన్నాల గోనాథ్, ఎండీ యాకుబ్ పాషా, మండల అధ్యక్షులు కోలపాక చందు, మున్సిపల్ కౌన్సిలర్లు కొయ్యాడ శ్రీనివాస్, బండి శ్రీధర్, అల్లె దశరథం, పాలకుర్తి శ్రీనివాస్, సమన్వయ కమిటీ సభ్యులు ఏకు విద్యాసాగర్, బొచ్చు సాల్మాన్, మేరుగు శ్రీశైలం, ఎండీ రంజాన్ ఆలీ, మార్క రఘుపతి, నల్లెల్ల అనిల్, కొక్కిరాల తిరుపతి రావు, బొమ్మకంటి చంద్రమౌళి, గడ్డం శివకుమార్, ఐలిపెల్లి స్వామి, గొట్టె రమేష్, పసుల శ్రీనివాస్, అజయ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# హన్నాజిపేట్ సొసైటీలో జీలుగ, జనుము విత్తనాల పంపిణీ



**వేద న్యూస్, ధర్పల్లి:**

రైతులు ప్రభుత్వం అందిస్తున్న జీలుగ, జనుము విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఏవో వెంకటేశ్వర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిన్న బాల్‌రాజ్ సూచించారు. గురువారం హన్నాజిపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని సొసైటీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, సీఈఓ గంగా నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో రైతులకు జీలుగ, జనుము విత్తనాలు అందజేస్తోందన్నారు. ప్రధాన పంటలు వేసే ముందు జీలుగ, జనుము పంటలను సాగు చేసి కలియదున్నడం వల్ల భూసారం పెరిగి సహజ ఎరువుగా ఉపయోగపడుతుందని తెలిపారు. సొసైటీ ద్వారా అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ధర్పల్లి సొసైటీ చైర్మన్ చిన్నరెడ్డి, డైరెక్టర్లు సుభాష్ రెడ్డి, నరేందర్, రైతులు భూమాయి మోహన్ రెడ్డి, మోహన్, పెండ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



**వేద న్యూస్, రుద్రూర్:**

రుద్రూర్ మండలంలోని చిక్కడపల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు గ్రామ సర్పంచ్ మచ్కురి రమేష్ మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని కూలీల ఆరోగ్య రక్షణ కోసం మజ్జిగ పంపిణీ చేసినట్లు తెలిపారు. వేసవి కాలంలో ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కళ్యాణ్, వార్డు సభ్యులు జల్ల సాయిలు, కుర్మరాజు, బెగరి గోపి, సావిత్రి, పద్మ, జ్యోతి, మంజుల, ఫీల్డ్ అసిస్టెంట్ సాయిలు, గ్రామ పెద్దలు, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# సుంకే ఆరోపణలు అర్థరహితం

**– మట్టి మాఫియాకు కేరాఫ్ బీఆర్ఎస్**

**– కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్**

**వేద న్యూస్, గంగాధర:**

తెలంగాణ రాష్ట్రంలో మట్టి మాఫియాకు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ పార్టీయేనని కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్ ఆరోపించారు. గురువారం గంగాధర ప్రజా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ చేసిన ఆరోపణలు దొంగే దొంగ దొంగ అన్నట్లుగా ఉన్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అప్పటి ఎమ్మెల్యేలు బొడిగె శోభ, సుంకే రవిశంకర్ చెరువుల మట్టి అమ్ముకుని కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. వరద కాలువ మట్టిని అమ్ముకుని పెట్రోల్ బంకుల వద్ద డబ్బులు వసూలు చేసిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు. పోలీస్ అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్ల వద్ద డబ్బులు వసూలు చేసింది రవిశంకర్ కాదా అని ప్రశ్నించారు. కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల విషయంలో కూడా కమిషన్లు వసూలు చేశారని ఆరోపించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కడిగిన ముత్యం లాంటి నాయకుడని కొనియాడారు. ఆయన ఎప్పుడూ అధికారుల వద్ద డబ్బులు వసూలు చేయలేదని, ప్రజా సేవకే కట్టుబడి పనిచేస్తున్నారని



పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. కొండగట్టు అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో, గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కీలక పాత్ర పోషించారని తెలిపారు. మరోసారి ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మట్టి రవాణాపై పోలీసుల దాడులు

**– జేసీబీ, రెండు ట్రాక్టర్లు సీజ్.. ఆరుగురిపై కేసు**

**వేద న్యూస్, వేములవాడ ప్రతినిధి:**



వేములవాడ అర్బన్ మండలం పరిధిలో అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. విశ్వసనీయ సమాచారం మేరకు వేములవాడ టౌన్ పోలీసులు తెల్లవారుజామున నిర్వహించిన మెరుపు దాడుల్లో ఒక జేసీబీ, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం చంద్రగిరి గ్రామ పరిసరాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రెండు ట్రాక్టర్లు, ఒక జేసీబీ సహాయంతో అక్రమంగా మట్టిని లోడ్ చేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వాహనాలను నిలిపివేసి అనుమతి పత్రాలు చూపించాలని కోరగా, సంబంధిత వ్యక్తులు ఎలాంటి చెల్లుబాటు అయ్యే పత్రాలు చూపించలేక పోయారు. మధ్యవర్తుల సమక్షంలో విచారించగా అక్రమంగా మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ విక్రయిస్తున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో ముగ్గురు డ్రైవర్లు, ముగ్గురు వాహన యజమానులను గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. పట్టుబడిన జేసీబీ, రెండు ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అనుమతులు లేకుండా మట్టి, ఇసుక తవ్వకాలు లేదా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని వేములవాడ టౌన్ పోలీసులు సూచించారు.

# సబ్సిడీ రుణాలు పారదర్శకంగా అందించాలి

**– సర్పంచ్ వెంకటేష్**

**వేద న్యూస్, నడికూడ:**

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతకు అందిస్తున్న సబ్సిడీ రుణాలను పారదర్శకంగా, రాజకీయ జోక్యం లేకుండా అర్హులైన పేదలకు అందించాలని ముస్త్యాలపల్లి గ్రామ సర్పంచ్ మేకమల్ల వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల ఎంపిక గ్రామ సభల ద్వారా జరిగేదని గుర్తు చేశారు. ఇప్పటికే లబ్ధి పొందిన వారిని కాకుండా గ్రామాల్లో నిజంగా ఆర్థికంగా వెనుకబడిన పేదలను గుర్తించి వారికి జీవనోపాధి కల్పించే విధంగా రుణాలు మంజూరు చేయాలని కోరారు.



# రాజీవ్ సేవలు చిరస్మరణీయం

- మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పర్నేం మల్లారెడ్డి
- ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి

**వేద న్యూస్, నడికూడ:**



భారత మాజీ ప్రధానమంత్రి, సాంకేతిక విప్లవ పితామహుడు రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా పరకాల నియోజకవర్గంలోని నడికూడ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పర్నేం మల్లారెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ భారత దేశ పురోభివృద్ధికి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని యువతకు అందించడంలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నడికూడ గ్రామ సర్పంచ్ కుడ్ల మలహాల్ రావు, నార్లపూర్ సర్పంచ్ పెద్దవేన రవీందర్, రాయపర్తి సర్పంచ్ రాజ జగత్ ప్రకాశ్, కంఠాత్మకూర్ సర్పంచ్ కొంగంటి తిరుపతి, ధర్మారం సర్పంచ్ బాసిక ఎల్లస్వామి, చౌట్పర్తి సర్పంచ్ ఓదెల సమ్మయ్య, సమన్వయ కమిటీ సభ్యులు పాడి వివేక్, నారగాని కుమారస్వామి, అప్పం చేరాలు, మహిళా నాయకురాలు బిల్లకంటి లక్ష్మి, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చొప్పదండిలో ఘనంగా రాజీవ్ వర్ధంతి

**వేద న్యూస్, చొప్పదండి:**

భారత మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా చొప్పదండి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నిజానపురం చందు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇప్ప శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసి, 18 సంవత్సరాలు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కిందన్నారు. ఆయన ఆశయాలను భావితరాలకు అందించేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, వైస్ చైర్‌పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య గౌడ్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# యాగశాల నిర్మాణానికి ఆర్థిక సహాయం

- దాత దంపతులకు ఆలయ కమిటీ సన్మానం




**వేద న్యూస్, నల్లబెల్లి:**

నల్లబెల్లి మండల కేంద్రంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో ఇటీవల నిర్మించిన యాగశాలకు నర్సంపేట ప్రభుత్వ విశ్రాంత వైద్యాధికారి జాటోత్ ఉదయ్ సింగ్, ఉషాదేవి దంపతులు పూర్తి ఆర్థిక సహాయం అందించి గురువారం ప్రారంభించారు. ముందుగా దేవాలయంలోని శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం దేవతామూర్తులకు పూజలు చేశారు. యాగశాల నిర్మాణానికి సహకారం అందించిన దాత దంపతులను దేవాలయ పూజారి పెండోట మురళీమోహనాచార్యులు, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు పురాం బద్రీనాథ్, కోశాధికారి మార్త మార్కండేయ, కార్యదర్శి మురికి మనోహర్‌రావు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం దాత దంపతులకు ఆలయ కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది.

# క్రీడాకారులకు స్నాక్స్, రాగి జావా పంపిణీ

**వేద న్యూస్, వీర్నపల్లి:**



వీర్నపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉచిత క్రికెట్ సమ్మర్ క్యాంప్ విజయవంతంగా కొనసాగు తోంది. ఈ సందర్భంగా స్థానిక యువకులు అన్నారం అనిల్ కుమార్, అన్నారం అజయ్ కుమార్ తమ తండ్రి కీ.శే. అన్నారం జనార్దన్ స్మారకార్థం క్యాంప్‌కు హాజరవుతున్న క్రీడాకారులకు స్నాక్స్, ఆరోగ్యకరమైన రాగి జావాను పంపిణీ చేశారు. యువ క్రీడాకారుల ఆరోగ్యం, ఉత్సాహాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్వహించిన ఈ సేవా కార్యక్రమాన్ని స్థానిక ప్రజలు, క్రీడాకారులు అభినందించారు. గ్రామ యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ అన్నారం కుటుంబ సభ్యులు సహకారం అందించడం ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని అన్నారం కుటుంబ సభ్యులను అభినందించారు. క్రీడల అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ అమలు చేయాలి

- తపస్ జిల్లా కార్యదర్శి మంగ నర్సింలు



**వేద న్యూస్, పాపన్నపేట:**

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీంలో సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగులను మినహాయించడం హేయమైన చర్య అని తపస్ మెదక్ జిల్లా కార్యదర్శి మంగ నర్సింలు విమర్శించారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల కోసం ప్రతిపాదించిన నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీం అమలులో సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగులపై వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగంలో ఉన్నంతకాలం మూల వేతనం నుంచి 1.5 శాతం నిధులు కట్ చేసుకుని క్యాష్‌లెస్ వైద్యం అందించి, రిటైర్ అయిన వెంటనే హెల్త్ కార్డులు చెల్లవనడం ఏ రకమైన న్యాయమని ప్రశ్నించారు. వృద్ధాప్యంలోనే వైద్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగులందరికీ నూతన హెల్త్ స్కీం కింద పూర్తి స్థాయి క్యాష్‌లెస్ వైద్యం అందేలా జీవోలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

# పట్టణ సమగ్రాభివృద్ధే మున్సిపాలిటీ ధ్యేయం

**వేద న్యూస్, పరకాల ప్రతినిధి:**

పరకాల పట్టణ సమగ్రాభివృద్ధే మున్సిపాలిటీ ప్రధాన ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలో రూ. 42.50 లక్షల టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. స్థానిక సీఎస్ఐ స్కూల్ నుంచి పిడుగుబండ వరకు నిర్మించనున్న ఈ రహదారి పనులను మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానిక శ్మశాన వాటికలకు వెళ్లే ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. పట్టణ అభివృద్ధికి మున్సిపాలిటీ నిరంతరం కట్టుబడి ఉంటుందని, భవిష్యత్తులో మరిన్ని మౌలిక వసతుల పనులు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఏకు దివ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఒంటేరు శ్రావణ్ కుమార్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



- రూ. 42.50 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

# కోనేరు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత సైకిళ్ల పంపిణీ

- మండల టాపర్ విద్యార్థికి సైకిల్ అందజేత



**వేద న్యూస్, రుద్రూర్:**

బాన్సువాడ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు కోనేరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత సైకిళ్లు పంపిణీ చేశారు. ఇందులో భాగంగా రుద్రూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థి అద్నాన్‌కు గురువారం ట్రస్ట్ సభ్యులు సైకిల్ అందజేశారు. అనంతరం విద్యార్థి తండ్రి ఎండి నసీమ్ ఉద్దీన్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోనేరు చారిటబుల్ ట్రస్ట్ బృంద సభ్యులు మార్నెల్లి ప్రకాష్ పటేల్, సున్నం సాయిలు, వడ్ల శేఖర్, ప్రశాంత్ గౌడ్, కటిక రామరాజు, బోజిగొండ అనిల్, రాజేష్ బాబు, ఏముల నవీన్, ఆలపాటి హరికృష్ణ, గోవురు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా ఉద్యోగ సంఘం

- నిరుపేద కుటుంబాలకు ఆర్థిక సహాయం

**వేద న్యూస్, కారేపల్లి:**



ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గుంపెల్ల గూడెం గ్రామంలో ఉద్యోగ సంఘ సభ్యులు మరోసారి సేవా కార్యక్రమాలతో మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ "ఆపదలో మేమున్నాం" అనే భావనను కార్యరూపంలో చూపించారు. గ్రామానికి చెందిన కొర్ర వీరు కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో కుమార్తె వివాహం నిర్వహించలేని పరిస్థితిలో ఉందని తెలుసుకున్న ఉద్యోగ సంఘ సభ్యులు వెంటనే స్పందించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. అలాగే వృద్ధురాలు చంద్రమ్మ నివాసం శిథిలావస్థకు చేరుకోవడంతో ఇంటి మరమ్మతుల కోసం మరో రూ.5 వేల సహాయం చేశారు. సహాయం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఉద్యోగ సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఎవరికైనా ఆపద వచ్చినా వెంటనే స్పందిస్తూ సహాయం చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ గ్రామంలో ఎవరూ ఒంటరిగా లేరని, పేద కుటుంబాలు, వృద్ధులు, విద్యార్థులకు తమ వంతు సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు. గ్రామ అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ ముందుండి పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బానోత్ వీరన్న, బానోత్ రాంబాబు, బానోత్ వీరన్న (ఈర్య), లకావత్ లక్ష్మణ్, భూక్యా వీరన్న, అంగోత్ అనిల్, గుగులోత్ సురేష్, గుగులోత్ శంకర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ గుగులోత్ క్రిష్ణవేణి వీరబాబు, గ్రామ పెద్దలు ఉద్యోగ సంఘ సేవలను అభినందించారు.

# వైరా ఇంచార్జిగా ఆర్జేసీ కృష్ణ నియామకం



- శుభాకాంక్షలు తెలిపిన మంజుల మదన్‌లాల్

**వేద న్యూస్, కారేపల్లి:**

బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు డిజిటల్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు సభ్యత్వ నమోదు ఇంచార్జీలను ప్రకటించారు. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లా వైరా నియోజకవర్గ సభ్యత్వ నమోదు ఇంచార్జిగా ఆర్జేసీ కృష్ణను పార్టీ అధిష్ఠానం నియమించింది. డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదును పకడ్బందీగా నిర్వహించి గ్రామ, వార్డు స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించింది. వైరా ఇంచార్జిగా నియమితులైన ఆర్జేసీ కృష్ణకు బీఆర్ఎస్ నాయకురాలు మంజుల మదన్‌లాల్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్జేసీ కృష్ణ నియామకం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా వైరాలో సభ్యత్వ నమోదును విజయవంతం చేసి పార్టీని మరింత బలోపేతం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి సభ్యత్వాల లక్ష్యంతో బీఆర్ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక ఇంచార్జీలను నియమిస్తూ మండల, గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తోంది. కొత్తగా నియమితులైన ఇంచార్జీలు త్వరలోనే ఆయా నియోజకవర్గాల్లో సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నారు.

వేద న్యూస్

శుక్రవారం మే 22, 2026

# మట్టి మాఫియాకు కేరాఫ్ బీఆర్ఎస్

- రవిశంకర్ ఆరోపణలు అర్ధరహితం
- కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్



**వేద న్యూస్, గంగాధర:**

తెలంగాణలో మట్టి మాఫియాకు కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్ పార్టీయేనని కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి ఆంజనేయులు గౌడ్ ఆరోపించారు. గంగాధరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో చెరువుల మట్టి అక్రమంగా విక్రయించి కోట్ల రూపాయలు సంపాదించారని ఆరోపించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కడిగిన ముత్యం లాంటి నాయకుడని, ఎలాంటి కమిషన్లు తీసుకోలేదని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ అభివృద్ధిపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. కొండగట్టు అభివృద్ధి, గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కృషి ఫలితమేనని పేర్కొన్నారు. ఎమ్మెల్యేపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

# యువతి అదృశ్యం

- ఆందోళనలో కుటుంబ సభ్యులు



**వేద న్యూస్, కారేపల్లి:**

కారేపల్లి మండలంలోని బల్లునగర్ తండాకు చెందిన గూగులోత్ నవీన అనే యువతి బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. తండ్రి సోమ్లా తెలిపిన వివరాల ప్రకారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో నవీన ఇంటి నుంచి వెళ్లిపోయిందని, రాత్రంతా బంధువులు, స్థానికులు పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదని తెలిపారు. అనంతరం కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ప్రాథమిక సమాచారం మేరకు నవీన కారేపల్లి ప్రాంతం నుంచి మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణించి ఉండవచ్చనే అనుమానంతో కొత్తగూడెం రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు రైల్వే స్టేషన్లు, పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో బల్లునగర్ తండాలో ఆందోళన వాతావరణం నెలకొంది. యువతి సురక్షితంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. యువతి ఆచూకీ తెలిసిన వారు 9441708702, 6281294432 నంబర్‌లకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# మున్సిపాలిటీలో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మున్సిపాలిటీ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నాగరాజు సూచించారు. గ్రామంలోని మంచినీళ్ల బావి నుంచి నీటిని సేకరించి శుద్ధి చేసి ప్రజలకు ప్యూరిఫైడ్ వాటర్ అందిస్తున్నట్లు తెలిపారు. కేవలం రూ.5 కాయిన్ బాక్స్‌లో వేసి శుద్ధి చేసిన తాగునీటిని పొందవచ్చని పేర్కొన్నారు.



# మహిళను వేధించిన కేసులో వ్యక్తికి రిమాండ్




**వేద న్యూస్, శాయంపేట:**

మహిళను వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిని పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం ట్లకానిపర్తి గ్రామానికి చెందిన బండారి విజయ్‌కుమార్ అదే గ్రామానికి చెందిన ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ విషయమై ఇప్పటికే కేసు నమోదు చేసినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో పోలీసులు అతడిని పరకాల మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. అనంతరం కోర్టు అతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

# రాజీవ్ గాంధీ సేవలను స్మరించిన ఎమ్మెల్యే

- వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులు

**వేద న్యూస్, దేవరకద్ర:**

దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో గురువారం మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌జీపీఆర్ఎస్ నేషనల్ చైర్మన్ సునీల్ పన్వార్, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడు రాచమల్లు సిద్దేశ్వర్‌తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే, రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను స్మరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి టెక్నాలజీ పరిచయం చేసిన మహానేత

- వర్ధంతి సందర్భంగా ఘన నివాళి



**వేద న్యూస్, శాయంపేట:**

భారత దేశానికి సాంకేతికతను పరిచయం చేసి ప్రపంచ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చిన మహానేత రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. గురువారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ దేశంలో సాంకేతిక విప్లవానికి నాంది పలికి కంప్యూటర్ యుగానికి శ్రీకారం చుట్టిన నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అభివృద్ధి, ఆర్థిక వ్యవస్థ సరళీకరణ, పరిశ్రమలకు ప్రోత్సాహం, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారని గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్లకు పునాది వేసిన ఘనత కూడా ఆయనకే దక్కుతుందని తెలిపారు. అతిపిన్న వయసులో ప్రధాని పదవిని చేపట్టి దేశ భవిష్యత్తు కోసం దూరదృష్టితో పనిచేశారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా నేడు ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిందం రవి, ఏరుకొండ శంకర్, బాసని మార్కండేయ, కొమ్ముల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అక్కడికక్కడే మృత్యువాత

**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి పట్టణంలోని గుమ్లాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మంచిర్యాల నుంచి కరీంనగర్ వస్తున్న టీఎస్ 02 యూడీ 7080 నెంబర్ గల ఆర్టీసీ హైర్ బస్సు, కరీంనగర్ నుంచి వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేటకు వెళ్తున్న టీఎస్ 02 ఈఎన్ 5842 నెంబర్ గల బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న సప్ప తిరుపతి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన రాములు కుమారుడిగా గుర్తించారు. ప్రమా దానికి సంబంధించిన బస్సు, డ్రైవర్‌ను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.




# గజానన్ బిడ్కర్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం

- మూకనాయక్ నేషనల్ అవార్డు-2026 ప్రదానం
- పత్రికారంగం, సామాజిక సేవలకు గుర్తింపు

**వేద న్యూస్, మల్కాజ్ గిరి**

పత్రికారంగం, సామాజిక సేవ, ప్రజా చైతన్య రంగాల్లో విశేష సేవలు అందించిన గజానన్ గంగాధరరావు బిడ్కర్‌కు హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రతిష్టాత్మక "మూకనాయక్ నేషనల్ అవార్డు2026" ప్రకటించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ పాత్రికేయులు, సామాజిక ప్రముఖుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో గజానన్ బిడ్కర్‌కు సన్మాన చిహ్నం, ప్రశంసాపత్రం, శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం ఆయన పురోగామి పాత్రికేయ సంఘ్ (భారత్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా, సాప్తాహిక మహిమ ఖాదీచా ప్రధాన సంపాదకుడిగా సేవలందిస్తున్నారు. సామాన్య ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడడం, ప్రజా చైతన్యం కల్పించడం వంటి సేవలకు గుర్తింపుగానే ఈ అవార్డు లభించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గజానన్ బిడ్కర్ మాట్లాడుతూ ఈ అవార్డు నిజాయితీగా సమాజహితం కోసం పనిచేస్తున్న ప్రతి పాత్రికేయుడు, సామాజిక కార్యకర్తకు దక్కిన గౌరవమని తెలిపారు. కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయనను అభినందించారు.



# అమరచింతలో ఘనంగా రాజీవ్ వర్ధంతి

**వేద న్యూస్, దేవరకద్ర:**



భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా అమరచింతలో పట్టణ, మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సమాచార, సాంకేతిక రంగాలకు బలమైన పునాదులు వేసి యువతకు కొత్త అవకాశాల దారులు తెరిచిన మహానేత అని పేర్కొన్నారు. కంప్యూటర్ విప్లవం, టెలికమ్యూనికేషన్ అభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం ద్వారా దేశాన్ని ఆధునిక యుగంలోకి తీసుకెళ్లారని తెలిపారు. 18 సంవత్సరాల యువతకు ఓటు హక్కు కల్పించి ప్రజాస్వామ్యంలో యువశక్తికి ప్రాధాన్యం పెంచిన నాయకుడు రాజీవ్ గాంధీ అని గుర్తుచేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం కూడా యువత అభివృద్ధి, డిజిటల్ పురోగతి, ఉపాధి అవకాశాల కల్పనకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు

- మరో ముగ్గురికి జరిమానా విధించిన కోర్టు

**వేద న్యూస్, శాయంపేట:**

హత్యాయత్నం కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించినట్లు ఎస్సై పరమేశ్వర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఐనవోలుకు చెందిన కొత్తూరు అనూష ఫిర్యాదు మేరకు, మండలంలోని మాందారిపేటలో ఆమె తల్లి కుటుంబంపై జరిగిన దాడి ఘటనలో అప్పటి పోలీసులు ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేశారు. ఈ కేసును విచారించిన హనుమకొండ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి గండు రామలింగం నిందితులు కొమ్ముల ఆరోగ్యం, కొమ్ముల భాస్కర్, కొమ్ముల బాబులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధించారు. అలాగే కొమ్ముల సంధ్యారాణి, కొమ్ముల సుగుణ, ఖిలా వరంగల్‌కు చెందిన మైదం సుమలతలకు ఒక్కొక్కరికి రూ.8 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.

# బాధితుల్లో భరోసా కల్పించాలి

- కొత్త అధికారులకు సీపీ సూచనలు
- ఫిర్యాదులపై పారదర్శక విచారణకు ఆదేశం
- ప్రజల్లో నమ్మకం పెంచాలని పిలుపు



**వేద న్యూస్ వరంగల్ :**

పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడిలో న్యాయం జరుగుతుందనే నమ్మకం కలిగించాలని వరంగల్ పోలీసు కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. ప్రజలకు న్యాయం అందించడంలో పోలీసుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. విధుల్లో పారదర్శకత, బాధ్యతతో వ్యవహరించాలని అధికారులకు సూచించారు. టాస్క్ ఫోర్స్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బండారి రాజు, మిల్స్ కాలనీ పోలీసు స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కె. స్వామి గురువారం పోలీసు కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కమిషనర్‌కు మొక్కను అందజేశారు. సమావేశంలో మాట్లాడిన పోలీసు కమిషనర్ ప్రజల సమస్యల పరిష్కారంలో సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును సున్నితంగా పరిగణించి స్పందించాలని తెలిపారు. ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ జరపాలని ఇరువురు అధికారులకు ఆదేశించారు. బాధితులకు సరైన సమయంలో స్పందించడం ద్వారా ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం కూడా పోలీసు విధుల్లో ముఖ్య భాగమని కమిషనర్ తెలిపారు. చట్టపరమైన విధులు నిర్వహించేటప్పుడు మానవతా దృక్పథాన్ని కూడా పాటించాలని సూచించారు. పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకం పెంచేలా ప్రతి అధికారి బాధ్యతతో పనిచేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ప్రజా సేవే ప్రధాన లక్ష్యంగా విధులు నిర్వహించాలని సూచించారు.

# అప్పుల్లో పుట్టి.. అప్పుల్లోనే రైతు జీవితం!



- మరణించినా మాఫీ కాని క్రాప్ లోన్లు
- హోం లోన్‌ల మాదిరిగా రుణ రక్షణ కల్పించాలంటున్న రైతు కుటుంబాలు
- రుణమాఫీ హామీలు పూర్తిగా అమలు కాలేదంటూ ఆవేదన
- ప్రతి రైతుకు బీమా వర్తింపజేయాలని డిమాండ్

**వేద న్యూస్, నిజామాబాద్:**

అప్పుల్లో పుట్టి అప్పుల్లోనే రైతు మరణిస్తున్నాడనే సామెత ఇప్పటికీ మారలేదని రైతు కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. రైతులకు భరోసా పథకాలు, పెట్టుబడి సాయం అందిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ, పంట నష్టాలు, ప్రకృతి విపత్తులు, అప్పుల భారం నుంచి రైతు మాత్రం బయటపడలేకపోతున్నాడని అంటున్నారు. పంటల సాగు కోసం రైతులు బ్యాంకుల నుంచి క్రాప్ లోన్లు తీసుకుని వ్యవసాయం చేస్తుంటే, వరదలు, వడగండ్ల వానలు, ఎండల కారణంగా పంటలు దెబ్బతిని తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారు. నిజామాబాద్ జిల్లాలో గత రెండు సీజన్లలో పంట నష్టం ఎక్కువగా జరిగినప్పటికీ, నష్టపరిహారం పూర్తిస్థాయిలో అందలేదని రైతులు చెబుతున్నారు. రుణమాఫీ ప్రకటించినప్పటికీ చాలా మంది రైతులకు పూర్తిస్థాయిలో అమలు కాలేదని, ఆధార్, బ్యాంక్ ఖాతాలు, పట్టా పాస్ పుస్తకాలలో అక్షర దోషాలు పేరుతో అనేక మందికి రుణమాఫీ నిలిచిపోయిందని పేర్కొంటున్నారు. రుణం తీసుకున్న రైతులు మరణించినా బ్యాంకులు కుటుంబ సభ్యులకు ఫోన్లు చేసి రుణం చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నాయని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**క్రాప్ లోన్లకు కూడా రుణ రక్షణ బీమా..**

హోం లోన్ తీసుకున్న వ్యక్తి మరణిస్తే ఇన్సూరెన్స్ ద్వారా రుణం మాఫీ అవుతుందని, అదే విధంగా రైతు క్రాప్ లోన్లకు కూడా రుణ రక్షణ బీమా తప్పనిసరి చేయాలని రైతు కుటుంబాలు కోరుతున్నాయి. రైతు మరణించిన తర్వాత కుటుంబం అప్పుల బారిన పడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక విధానం తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. క్రాప్ లోన్లకు రుణ రక్షణ బీమా ఉన్నప్పటికీ చాలా మంది రైతులకు అవగాహన లేకపోవడంతో ప్రయోజనం అందడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం రైతు బీమా 60 ఏళ్ల లోపు వారికి మాత్రమే వర్తిస్తుండగా, వయోపరిమితి తొలగించి వ్యవసాయం చేసే ప్రతి రైతుకు బీమా కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



- కొనుగోలు కేంద్రాల్లో పరిస్థితుల పరిశీలన
- రైతులకు ఇబ్బందులు లేకుండా ఆదేశాలు
- త్వరిత తూకం, రవాణాపై సూచనలు

**వేద న్యూస్ జగిత్యాల :**

జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ధాన్యం సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా గురువారం కథలాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలికోట, అంబారిపేట, తాండ్రియాల, గంబీర్‌పూర్ గ్రామాల్లో కొనసాగుతున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యం నిల్వలు, తూకం ప్రక్రియ, రవాణా ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని కొలత యంత్రం అందుబాటులోకి వచ్చిన వెంటనే ఆలస్యం చేయకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులకు ఆదేశించారు. రైతులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి రైతులకు మెరుగైన సేవలు అందించాలని పేర్కొన్నారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు అమ్మిన ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే సంబంధిత వివరాలను కంప్యూటర్ వ్యవస్థలో నమోదు చేసి రైతుల ఖాతాల్లో సకాలంలో డబ్బులు జమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మిల్లుల వద్ద ధాన్యం త్వరగా దిగేలా చర్యలు చేపట్టాలని కూడా కలెక్టర్ పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం ఎక్కువసేపు నిల్వ ఉండకుండా వెంటనే తరలించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రైతులకు అసౌకర్యం కలగకుండా ప్రతి అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయడంతో పాటు రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో కోరుట్ల రెవెన్యూ విభాగాధికారి జీవాకర్ రెడ్డి, పౌర సరఫరాల శాఖ అధికారులు జితేందర్ రెడ్డి, మనోజ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రీల్స్ పోటీలతో ములుగు పర్యాటక ప్రచారం

**వేద న్యూస్ ములుగు :**



ములుగు జిల్లా పర్యాటక రంగ అభివృద్ధికి వినూత్న కార్యక్రమాలను చేపడుతున్న జిల్లా యంత్రాంగం మరో ముందడుగు వేసింది. జిల్లా పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న "ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ పోటీ"పై జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో సామాజిక మాధ్యమాల ప్రభావశీలులు, మీడియా ప్రతినిధులు, సామాజిక మాధ్యమాల నిర్వాహకులతో జిల్లా కలెక్టర్ ముఖాముఖి చర్చించారు. ములుగు జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను విస్తృతంగా ప్రచారం చేయడంలో సామాజిక మాధ్యమాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. రీల్స్ పోటీ ద్వారా జిల్లాలోని ప్రకృతి అందాలు, చారిత్రక ప్రాంతాలు, సాంస్కృతిక వారసత్వాన్ని మరింత మందికి చేరవేయవచ్చని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఆధునిక ప్రచార పద్ధతులను వినియోగించుకుంటూ పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోటీల నిర్వహణ విధానం, నమోదు ప్రక్రియ, పోటీ నిబంధనలు, విజేతలకు అందించే బహుమతుల వివరాలను కలెక్టర్ వివరించారు. పోటీల్లో ఎక్కువ మంది యువత, సామాజిక మాధ్యమాల సృజనకారులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ములుగు జిల్లాలో అనేక సహజ, చారిత్రక, సాంస్కృతిక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని దేశవ్యాప్తంగా ప్రచారం చేయడం ద్వారా పర్యాటక రంగానికి కొత్త ఊపు వస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాకు మరింత గుర్తింపు రావడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యాటక అభివృద్ధి దిశగా ఇటువంటి కార్యక్రమాలు మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు.

# దేశానికి రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

**వేద న్యూస్, వరంగల్ టౌన్ :**



వరంగల్ నగరంలో ఎంజీఎం కూడలిలో మాజీ ప్రధాని దివంగత నేత స్వర్గీయ రాజీవ్ గాంధీ 35 వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు నాయని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కూడా చైర్మన్ హనుమకొండ జిల్లా అధ్యక్షులు వెనకాల వెంకట రామిరెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయూబ్, వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య, వరంగల్ మాజీ మేయర్ గుండు సుధారాణి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తూల రవి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రవీందర్ నాయక్, మహిళా అధ్యక్షురాలు బంక సరళ, బీసీ సెల్ అధ్యక్షుడు వరుస తిరుపతి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ నగర అధ్యక్షుడు కట్ల శ్రీనివాస్, కరాటే ప్రభాకర్, వై భాస్కర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నల్గొండ రమేష్, కోదాటి అన్నులు, కామాలుద్దీన్, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి దశాదిశా చేసిన మహనీయుడు రాజీవ్ గాంధీని అన్నారు. భారతదేశాన్ని టెక్నాలజీ పరంగా ముందు వరుసలో నిలబెట్టిన గొప్ప దార్శనికుడని కొనియాడారు.

# మార్కెట్ యార్డులో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**వేద న్యూస్ కొత్తగూడెం :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని కొత్తగూడెం వ్యవసాయ కమిటీ మార్కెట్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. మార్కెట్ యార్డులో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు, నిల్వలు, అన్‌లోడింగ్ ప్రక్రియలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. వివిధ మండలాల నుంచి రైతులు తీసుకొచ్చిన ట్రాక్టర్లు, లారీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం మార్కెట్‌లో సుమారు రెండువేల ఐదు వందల మెట్రిక్ టన్నుల గోడౌన్ సామర్థ్యం అందుబాటులో ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, గుండాల మండలాలకు చెందిన మొక్కజొన్నను ఈ మార్కెట్‌కు అనుసంధానం చేసినట్లు తెలిపారు. రైతులు తీసుకొచ్చే పంటను వేగంగా స్వీకరించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మొక్కజొన్న అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. రైతులు ఎక్కువసేపు వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా అవసరమైన హమాలీలు, యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రస్తుతం మార్కెట్‌లో నూట పది మంది హమాలీలు విధుల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మొక్కజొన్న బస్తాల తూకం, నిల్వ, రవాణా ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. గోడౌన్లలో నిల్వలను శాస్త్రీయ పద్ధతుల్లో భద్రపరచాలని, నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులను ఆదేశించారు. పంట నిల్వలో ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మార్కెట్ యార్డుకు వచ్చే రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని కూడా కలెక్టర్ సూచించారు. తాగునీరు, విశ్రాంతి కోసం నీడ, పారిశుద్ధ్య ఏర్పాట్లు, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ప్రతి అంశాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. వ్యవసాయ మార్కెట్లలో రైతులకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు. రైతు సంక్షేమం దృష్టిలో పెట్టుకుని కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ శిరీష, వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెట్ శాఖ సిబ్బంది, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని జిల్లా యంత్రాంగం వెల్లడించింది.

# భారత కుబేరుల జాబితాలో కొత్త రికార్డులు.. అంబానీ అగ్రస్థానంలోనే

**వేద న్యూస్ డెస్క్:**

అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ ఒత్తిడిని ఎదుర్కొంటున్నప్పటికీ భారతీయ కుబేరులు మాత్రం సంపద సృష్టిలో కొత్త రికార్డులు నెలకొల్పుతున్నారు. ప్రముఖ అంతర్జాతీయ వ్యాపార పత్రిక ఫోర్బ్స్ విడుదల చేసిన ప్రపంచ కుబేరుల జాబితా–2026లో భారత్ నుంచి రికార్డు స్థాయిలో 229 మంది చోటు దక్కించుకోవడం విశేషం. వీరి మొత్తం ఆస్తి విలువ తొలిసారిగా లక్ష కోట్ల డాలర్ల మార్కును దాటినట్లు ఫోర్బ్స్ వెల్లడించింది. ఈసారి ఏకంగా 30 మంది కొత్తవారు జాబితాలోకి ప్రవేశించారు. దేశంలోనే కాకుండా ఆసియాలో అత్యంత ధనవంతుడిగా ముకేశ్ అంబానీ తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఆయన మొత్తం ఆస్తి విలువ 99.7 బిలియన్ డాలర్లుగా నమోదైంది. రెండో స్థానంలో గౌతమ్ అదానీ నిలిచారు. ఆయన సంపద 63.8 బిలియన్ డాలర్లుగా అంచనా వేశారు. దేశవ్యాప్తంగా కృత్రిమ మేధ ఆధారిత మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ రెండు వ్యాపార సామ్రాజ్యాలు కలిపి 210 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించాయి. దీంతో భారత టెక్నాలజీ రంగంలో భారీ మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఓపీ జిందాల్ గ్రూప్ అధినేత్రి సావిత్రి జిందాల్ 39.1 బిలియన్ డాలర్ల ఆస్తితో దేశంలోనే అత్యంత ధనవంతురాలైన మహిళగా నిలిచారు. మొత్తం జాబితాలో ఆమెకు మూడో స్థానం దక్కింది. జిందాల్ గ్రూప్ వ్యాపార విస్తరణతో ఆమె సంపద గణనీయంగా పెరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ఇక కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ 14.4 బిలియన్ డాలర్ల ఆస్తితో టాప్–10 జాబితాలో చోటు సంపాదించారు. భారత విద్యా సాంకేతిక రంగంలో ఈసారి సంచలన మార్పులు కనిపించాయి. ప్రముఖ విద్యా వేదిక 'ఫిజిక్స్ వాలా' వ్యవస్థాపకులు అలఖ్ పాండే, ప్రతీక్ మహేశ్వరి తొలిసారి కుబేరుల జాబితాలో చోటు సంపాదించారు. గత ఏడాది సంస్థ ఐపీఓకు వచ్చిన అద్భుత స్పందనతో వీరి సంపద భారీగా పెరిగింది. ఈసారి జాబితాలో చోటు దక్కించుకున్న అత్యంత పిన్న వయస్కుడైన భారతీయుడిగా



అరవింద్ శ్రీనివాస్ నిలిచారు. కేవలం 31 ఏళ్ల వయసులోనే ఆయన కుబేరుడిగా అవతరించారు. ప్రముఖ కృత్రిమ మేధ సెర్చ్ స్టార్టప్ 'పెర్‌ప్లెక్సిటీ' సహ వ్యవస్థాపకుడిగా ఆయన ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారు. కొన్నేళ్ల తర్వాత పేటీఎమ్ వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ మళ్లీ కుబేరుల జాబితాలోకి తిరిగి వచ్చారు. మరోవైపు ఓలా వ్యవస్థాపకుడు భవీష్ అగర్వాల్ సహా మరో ఏడుగురు ఈసారి కుబేరుల హోదాను కోల్పోయారు. భారత్ టాప్–10 కుబేరుల జాబితాలో ముకేశ్ అంబానీ మొదటి స్థానంలో ఉండగా, గౌతమ్ అదానీ రెండో స్థానంలో నిలిచారు. సావిత్రి జిందాల్ మూడో స్థానంలో ఉండగా, లక్ష్మీ మిట్టల్, శివ్ నాడార్, సైరస్ పూనావాలా, దిలీప్ సంఘ్వీ, కుమార్ మంగళం బిర్లా, రాధాకిషన్ దమానీ, ఉదయ్ కోటక్ తదుపరి స్థానాల్లో నిలిచారు.

# స్కోడా 'జీఓఏటీ' ప్రచారం.. ఆసియా రికార్డులతో దూసుకెళ్లిన కార్లు

**వేద న్యూస్ డెస్క్:**

ప్రముఖ కార్ల తయారీ సంస్థ స్కోడా ఆటో ఇండియా తన 125 ఏళ్ల మోటార్ స్పోర్ట్స్ వారసత్వాన్ని మరోసారి ఘనంగా చాటుకుంది. బ్రాండ్‌కు చెందిన శక్తివంతమైన పనితీరు, రేసింగ్ డీఎన్ఏను ప్రతిబింబించేలా 'జీఓఏటీ' పేరుతో సరికొత్త గ్లోబల్ ప్రచారాన్ని ప్రారంభించింది. సాధారణంగా "గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్"గా పిలిచే జీఓఏటీ పదాన్ని స్కోడా తనదైన శైలిలో "గ్రేటెస్ట్ ఆన్ ఎ ట్రాక్"గా మార్చి ఈ వినూత్న ప్రచారాన్ని రూపొందించింది. ఈ ప్రచారంలో భాగంగా తమిళనాడులోని కోయంబత్తూరులో ఉన్న కోస్ట్ రేసింగ్ సర్క్యూట్‌లో స్కోడా కార్లు సరికొత్త రికార్డులను సృష్టించాయి. "ఒకే తయారీదారుకు చెందిన అత్యంత వేగవంతమైన మల్టీ కార్ రిలే" విభాగంలో పోటీ పడి, ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌తో పాటు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కూడా స్థానం సంపాదించాయి. ఐదు కార్లు.. ఒకే లక్ష్యం.. వేగంలో కొత్త చరిత్ర ఈ ప్రత్యేక రికార్డు కోసం స్కోడా తన ఫ్లీట్‌లోని ఐదు ప్రముఖ కార్లను ట్రాక్‌పైకి దించింది. కైలాక్, కుషాక్, స్లావియా, కోడియాక్ మరియు ఆక్టేవియా ఆర్ఎస్ కార్లు ఈ రిలే రేసులో పాల్గొన్నాయి. ఐదుగురు ప్రొఫెషనల్ డ్రైవర్లు పిట్ లేన్ మార్పులతో కలిపి మొత్తం 3.8 కిలోమీటర్ల ట్రాక్‌ను కేవలం 12 నిమిషాల 30.97 సెకన్లలో పూర్తి చేసి రికార్డు నెలకొల్పారు. ఈ పోటీలో ఆక్టేవియా ఆర్ఎస్ అత్యంత వేగంగా 2 నిమిషాల 10.85 సెకన్లలో ట్రాక్ పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. కోడియాక్ 2:26.34, స్లావియా 2:27.63, కుషాక్ 2:29.7 మరియు కైలాక్ 2:31.6 సమయంలో ట్రాక్‌ను పూర్తి చేసి తమ



వేగం, హ్యాండ్లింగ్, బ్రేకింగ్ సామర్థ్యాలను నిరూపించాయి. 125 ఏళ్ల రేసింగ్ వారసత్వం స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ ఆశిష్ గుప్తా మాట్లాడుతూ.. వేగంతో పాటు భద్రతలోనూ ముందంజ స్కోడా వాహనాలు గ్లోబల్ క్రాష్ టెస్టుల్లో 5 స్టార్ భద్రతా రేటింగ్ సాధించాయని కంపెనీ తెలిపింది. వేగం మాత్రమే కాకుండా ప్రయాణికుల భద్రతకూ అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించింది. ఈ "జీఓఏటీ" ప్రచారం ద్వారా భారత ఆటోమొబైల్ రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు స్కోడా స్పష్టం చేసింది.

# టీనేజర్లకు కొత్త డిజిటల్ చెల్లింపుల సౌకర్యం




**వేద న్యూస్ డెస్క్:**

దేశంలో డిజిటల్ చెల్లింపుల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, టీనేజర్ల కోసం ప్రత్యేకంగా కొత్త సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పటివరకు బ్యాంకు ఖాతా లేకపోతే నేరుగా యూపీఐ చెల్లింపులు చేయడం సాధ్యం కాకపోయినా, ఇప్పుడు తల్లిదండ్రుల ఆధ్వర్యంలో టీనేజర్లు కూడా తమ సొంత మొబైల్ ఫోన్ల ద్వారా చెల్లింపులు చేసుకునే అవకాశం కల్పించారు. చిన్న మొత్తాల ఖర్చులు, పాఠశాల లేదా కళాశాల అవసరాలు, క్యాంటీన్ ఖర్చులు, మెట్రో ప్రయాణాలు, షాపింగ్ వంటి రోజువారీ అవసరాల కోసం ప్రతిసారీ తల్లిదండ్రులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ఈ కొత్త విధానం ఉపయోగపడనుంది. ఈ విధానం ద్వారా బ్యాంకు ఖాతా కలిగిన తల్లి లేదా తండ్రి ప్రధాన వినియోగదారులుగా ఉండగా, పిల్లలను ద్వితీయ వినియోగదారులుగా చేర్చుకునే అవకాశం ఉంటుంది. దీంతో పిల్లలు తమ మొబైల్ ఫోన్ల ద్వారానే క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లింపులు చేయగలుగుతారు. ఇంతకుముందు మాదిరిగా తల్లిదండ్రుల ఫోన్ తీసుకోవడం, సంకేత సంఖ్యల కోసం వేచి చూడడం లేదా చెల్లింపు కోడ్‌ను సందేశాల ద్వారా పంపించుకోవడం వంటి ఇబ్బందులు తగ్గనున్నాయి. పిల్లలు అధికంగా ఖర్చు చేయకుండా ఉండేందుకు కొన్ని పరిమితులను కూడా అమలు చేశారు. ఒక్కో లావాదేవీకి గరిష్ఠంగా రూ.5 వేల వరకు మాత్రమే చెల్లింపులు చేయగలుగుతారు. నెల మొత్తం ఖర్చు పరిమితిని రూ.15 వేలుగా నిర్ణయించారు. భద్రతా కారణాల దృష్ట్యా, ఈ సౌకర్యాన్ని ప్రారంభించిన తొలి అరగంటలో రూ.500 వరకు మాత్రమే, మొదటి 24 గంటల్లో రూ.5 వేల వరకు మాత్రమే లావాదేవీలు చేసేందుకు అనుమతి ఉంటుంది. అదేవిధంగా పిల్లలు ఎక్కడ ఎంత ఖర్చు చేస్తున్నారనే విషయాన్ని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు పరిశీలించే విధంగా ప్రత్యేక ఖర్చుల నివేదిక సదుపాయాన్ని కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. అవసరమైతే వెంటనే యాక్సెస్‌ను నిలిపివేసే అధికారం కూడా తల్లిదండ్రులకే ఉంటుంది. డిజిటల్ చెల్లింపుల సౌకర్యాన్ని టీనేజర్లకు చేరువ చేస్తూనే, భద్రత మరియు ఖర్చుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టి ఈ కొత్త విధానాన్ని రూపొందించినట్లు సంస్థ వెల్లడించింది.

# జకోవిచ్‌కు కొత్త కోచ్.. 25వ గ్రాండ్‌స్లామ్‌పై గురి



**వేద న్యూస్ డెస్క్:**

ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభానికి ముందు ప్రపంచ టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. గత ఏడాది నుంచి స్థిరమైన ప్రధాన కోచ్ లేకుండానే టోర్నీల్లో పాల్గొంటున్న జకోవిచ్ ఇప్పుడు తన స్వదేశానికి చెందిన మాజీ టెన్నిస్ ఆటగాడు విక్టర్ ట్రాయ్‌స్కీని హెడ్ కోచ్‌గా నియమించుకున్నాడు. ఈ విషయాన్ని జకోవిచ్ స్వయంగా సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించడంతో టెన్నిస్ ప్రపంచంలో ఇది హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు కోర్టులో కలిసి ఆడిన స్నేహితులు అయిన జకోవిచ్, ట్రాయ్‌స్కీ ఇప్పుడు గురు–శిష్యులుగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. "నా స్నేహితుడు, నా సహచరుడు.. ఇప్పుడు నా కోచ్. విక్టర్ ట్రాయ్‌స్కీకి స్వాగతం" అంటూ జకోవిచ్ చేసిన పోస్టు అభిమానులను ఆకట్టుకుంది. ఇప్పటికే 24 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలిచి చరిత్ర సృష్టించిన జకోవిచ్ గత రెండేళ్లుగా 25వ టైటిల్ కోసం ఎదురు చూస్తున్నాడు. మే 22తో 39వ ఏట అడుగుపెట్టనున్న ఈ సెర్బియా స్టార్ ఇంకా తనలోని పోరాట స్ఫూర్తి తగ్గలేదని నిరూపించాలనే పట్టుదలతో ఉన్నాడు. ప్రస్తుతం టెన్నిస్ ప్రపంచాన్ని శాసిస్తున్న యువ ఆటగాళ్లు జన్నిక్ సిన్నర్, కార్లోస్ అల్కరాజ్‌లకు గట్టి పోటీ ఇవ్వాలంటే తన ఆటను మరింత మెరుగుపరచుకోవాల్సిన అవసరం ఉందని భావించిన జకోవిచ్.. అందుకే అనుభవజ్ఞుడైన ట్రాయ్‌స్కీని కోచ్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. విక్టర్ ట్రాయ్‌స్కీ కూడా సెర్బియాకు చెందిన ప్రముఖ మాజీ టెన్నిస్ ఆటగాడే. జకోవిచ్‌తో కలిసి సెర్బియా జట్టుకు పదేళ్లకుపైగా ఆడిన అనుభవం అతనికి ఉంది. ఆటకు వీడ్కోలు పలికిన తర్వాత కోచింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ట్రాయ్‌స్కీ, కొంతకాలంగా జకోవిచ్ బృందంలో భాగంగానే కొనసాగుతున్నాడు. ముఖ్యంగా ఒలింపిక్స్‌లో జకోవిచ్ విజయానికి వెనుక అతని పాత్ర కూడా ఉందని టెన్నిస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పుడు పూర్తి స్థాయి హెడ్ కోచ్ బాధ్యతలు చేపట్టిన ట్రాయ్‌స్కీ, జకోవిచ్‌కు ఎంతోకాలంగా ఊరిస్తున్న 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. రోలాండ్ గారోస్ వేదికగా జరగనున్న ఫ్రెంచ్ ఓపెన్ నుంచే వీరి గురు–శిష్యుల ప్రయాణం అధికారికంగా మొదలుకానుంది. ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే ఫ్రెంచ్ ఓపెన్‌లో జకోవిచ్ ప్రదర్శనపై ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. వయసు పెరిగినా తన పట్టుదల, అనుభవం, మానసిక ధైర్యంతో మరోసారి చరిత్ర సృష్టించగలడా అనే చర్చ టెన్నిస్ అభిమానుల్లో జోరుగా సాగుతోంది.

# రోహిత్ ఫిట్‌నెస్‌పై బీసీసీఐ ఆందోళన

**వేద న్యూస్ డెస్క్:**

భారత క్రికెట్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ ఫిట్‌నెస్ ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 2027 వన్డే ప్రపంచకప్ సమయానికి రోహిత్ పూర్తి స్థాయి ఫిట్‌నెస్‌తో అందుబాటులో ఉంటారా లేదా అన్న అనుమానాలు బీసీసీఐ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. త్వరలో జరిగే ఆఫ్ఘనిస్థాన్ వన్డే సిరీస్‌కు ఆయనను ఎంపిక చేసినప్పటికీ, తుది జట్టులో ఆడటం మాత్రం ఫిట్‌నెస్ పరీక్ష ఫలితాలపైనే ఆధారపడి ఉంటుందని సమాచారం. రోహిత్ ప్రస్తుతం 40 ఏళ్ల వయసుకు చేరువవుతున్న నేపథ్యంలో గాయాల నుంచి కోలుకోవడానికి ఎక్కువ సమయం తీసుకుంటున్నారని సెలక్టర్లు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ముంబై ఇండియన్స్ తరఫున ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడుతున్న సమయంలో కూడా ఆయన గాయపడి కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ఐపీఎల్‌లో ఉన్నట్లుగా వన్డేల్లో ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధన లేకపోవడంతో పూర్తి 50 ఓవర్లు మైదానంలో ఫీల్డింగ్ చేయడం రోహిత్‌కు భారంగా మారే అవకాశం ఉందని జట్టు యాజమాన్యం ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ వయసులో గాయాల ప్రమాదం ఎక్కువగా ఉండటం, ఆటలో మునుపటి దూకుడు తగ్గడం వంటి అంశాలు కూడా సెలక్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఫిట్‌నెస్ విషయంలో విరాట్ కోహ్లీతో రోహిత్‌ను పోల్చలేమని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కోహ్లీ ఇప్పటికీ



అత్యుత్తమ ఫిట్‌నెస్‌తో కొనసాగుతుండగా, రోహిత్ విషయంలో మాత్రం వైద్య బృందం నివేదికే కీలకంగా మారనుంది. ఇక భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సెలక్టర్లు ప్రత్యామ్నాయ ఓపెనర్లను సిద్ధం చేసే పనిలో ఉన్నట్లు తెలుస్తోంది. యశస్వి జైస్వాల్, శుభ్‌మన్ గిల్‌తో పాటు ఇషాన్ కిషన్‌ను కూడా బ్యాకప్ ఓపెనర్‌గా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రపంచకప్ సమయానికి గాయాల సమస్యలు తలెత్తినా జట్టుకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి.

# సింధు ధరించిన 'టెంపుల్' పరికరం ఏంటి?

**వేద న్యూస్ డెస్క్:**



క్రీడా రంగంలో సాంకేతికత వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా క్రికెట్‌లో ఇప్పటికే సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుండగా.. ఇప్పుడు ఇతర క్రీడల్లో కూడా ఆధునిక టెక్నాలజీ అడుగుపెడుతోంది. తాజాగా భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ధరించిన ఓ ప్రత్యేక పరికరం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇటీవల పలు బ్యాడ్మింటన్ టోర్నీల్లోనూ, బెంగళూరులో జరిగిన ఓ క్రీడా కార్యక్రమంలో విరాట్ కోహ్లీని కలిసిన సమయంలోనూ సింధు తన కణత వద్ద ఓ చిన్న పరికరం ధరించి కనిపించింది. దీంతో అది ఏమిటన్న చర్చ సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. ఆ పరికరం పేరు 'టెంపుల్'. ఇది కృత్రిమ మేధస్సుతో పనిచేసే ఆధునిక చిప్. అథ్లెట్ల మెదడులో రక్తప్రసరణ ఎలా జరుగుతోందో ఈ పరికరం విశ్లేషిస్తుంది. అలాగే ఆటగాళ్ల మానసిక పరిస్థితి, ఒత్తిడి స్థాయి, ఏకాగ్రత వంటి అంశాలపై కీలక సమాచారాన్ని అందిస్తుంది. ఈ డేటా ఆధారంగా కోచ్‌లు ఆటగాళ్ల శిక్షణ విధానాల్లో మార్పులు చేయడానికి, ఒత్తిడి నియంత్రణకు సరైన నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. క్రీడాకారుల ప్రదర్శనను మెరుగుపరచడంలో ఈ పరికరం కీలకంగా మారే అవకాశముందని క్రీడా నిపుణులు భావిస్తున్నారు. ఈ సరికొత్త టెక్నాలజీని ప్రముఖ ఆహార సరఫరా సంస్థ జొమాటో వ్యవస్థాపకుడు దీపిందర్ గోయెల్ అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఇది ప్రయోగాత్మక దశలో ఉండగా.. పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే అథ్లెట్లకు ఎంతో ఉపయోగకరంగా మారుతుందని క్రీడా వర్గాలు చెబుతున్నాయి.

# పాండ్యకు భారీ షాక్..

**వేద న్యూస్ డెస్క్:**



ముంబై ఇండియన్స్ జట్టు కెప్టెన్ హార్దిక్ పాండ్యకు ఐపీఎల్ క్రమశిక్షణ కమిటీ భారీ షాక్ ఇచ్చింది. తాజాగా కొల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతడిపై జరిమానా విధించారు. హార్దిక్ మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను కూడా నమోదు చేశారు. మ్యాచ్ సందర్భంగా పది ఓవర్లు పూర్తైన తర్వాత నాలుగో బంతి వేసిన అనంతరం హార్దిక్ తీవ్ర అసహనానికి లోనైనట్లు తెలుస్తోంది. మైదానంలో తిరిగి వెళ్తున్న సమయంలో కోపంతో వికెట్లను కాలితో బలంగా తన్ని కింద పడేశాడు. క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా ఉద్దేశపూర్వకంగా వికెట్లను ధ్వంసం చేసినందుకే ఐపీఎల్ నిర్వాహకులు ఈ చర్యలు తీసుకున్నారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2 ప్రకారం మైదానంలోని క్రీడా సామగ్రిని లేదా వికెట్లను దుర్వినియోగం చేయడం నిషేధితం. ఒక జట్టు కెప్టెన్‌గా మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన హార్దిక్ ఇలా ప్రవర్తించడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఇప్పటికే ఈ సీజన్‌లో ఫామ్ లేమితో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముంబై ఇండియన్స్ జట్టుకు ఈ ఘటన మరింత ప్రతికూలంగా మారింది. ఐపీఎల్ క్రమశిక్షణ కమిటీ తీసుకున్న ఈ నిర్ణయం ఇతర ఆటగాళ్లకు కూడా హెచ్చరికగా నిలుస్తుందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వేద న్యూస్
శుక్రవారం మే 22 , 2026

# ఆశయాలు ఉండాలి.. కానీ ఇతరులను తొక్కేయకూడదు

**వేద న్యూస్ డెస్క్:**



అనన్యా పాండే

గ్లామర్ ప్రపంచం, కార్పొరేట్ రంగాల్లో విజయాన్ని అందుకోవాలంటే ఇతరులను వెనక్కి నెట్టాల్సిందే అన్న భావన చాలా మందిలో ఉంటుంది. ఆశయం అంటే స్వార్థం, పోటీ అంటే ఎదుటివారిని పడగొట్టడం అనే అభిప్రాయం సమాజంలో బలంగా కనిపిస్తుంది. అయితే ఈ ఆలోచనా విధానాన్ని బాలీవుడ్ నటి అనన్యా పాండే పూర్తిగా ఖండించారు. ఆశయాలు కలిగి ఉండటం తప్పు కాదని, కానీ ఎదుటివారికి హాని చేయకుండా కూడా విజయాన్ని సాధించవచ్చని ఆమె స్పష్టం చేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన అనన్యా పాండే తన వ్యక్తిగత ఆలోచనలు, కెరీర్ లక్ష్యాల గురించి ఎంతో స్పష్టంగా వివరించారు. “నాకు పెద్ద ఆశయాలు ఉన్నాయి. జీవితంలో చాలా సాధించాలనుకుంటున్నాను. కానీ దాని కోసం మరొకరిని కిందకు లాగాలనే ఆలోచన మాత్రం నాకు ఎప్పుడూ రాదు. నేను ఏం చేయాలనుకుంటున్నానో నాకు స్పష్టంగా తెలుసు” అని ఆమె తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చకు దారి తీశాయి. సినీ పరిశ్రమలో మహిళల మధ్య ఆరోగ్యకరమైన సహకారం ఎంత ముఖ్యమో కూడా అనన్యా ప్రస్తావించారు. ముఖ్యంగా బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకోన్‌ను ఉదాహరణగా చెబుతూ, ఆమె తన కెరీర్‌లో నిర్మించుకున్న స్థానం ఎంతోమంది యువ నటీమణులకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. “ముందున్న మహిళలు తమ తర్వాతి తరం కోసం మార్గం సుగమం చేస్తే, ఇండస్ట్రీ మరింత బలపడుతుంది” అని అనన్యా వ్యాఖ్యానించారు. అనన్యా చెప్పిన ఈ ఆలోచనలకు మానసిక నిపుణులు కూడా మద్దతు తెలుపుతున్నారు. ఇతరులపై ఈర్ష్యతో కాకుండా, తన ప్రతిభపై నమ్మకంతో ముందుకు వెళ్లడం నిజమైన ఆత్మవిశ్వాసానికి సంకేతమని వారు చెబుతున్నారు. ఇటువంటి వ్యక్తులు ఎల్లప్పుడూ తమ లక్ష్యాలపైనే దృష్టి పెడతారని, అదే సమయంలో మానవ సంబంధాలకు, నైతిక విలువలకు కూడా ప్రాధాన్యం ఇస్తారని విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా, సినీ రంగం, కార్పొరేట్ ప్రపంచంలో తీవ్రమైన పోటీ నెలకొంది. ఈ క్రమంలో ఒకరు ఎదగాలంటే మరొకరు పడిపోవాలనే భావన చాలా మందిలో పెరుగుతోంది. కానీ ఇదంతా అభద్రతా భావం వల్లే వస్తుందని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఓటమి భయం, నిరంతరం గుర్తింపు పొందాలనే తపన, అంతర్గత అసంతృప్తి కారణంగానే కొందరు ఇతరులను దెబ్బతీయాలనే ఆలోచనతో ముందుకు వెళ్తారని పేర్కొంటున్నారు. అయితే అలాంటి పోటీ తత్వం తాత్కాలిక విజయాన్ని మాత్రమే ఇస్తుందని, దీర్ఘకాలంలో మంచి సంబంధాలు, నమ్మకం, మానసిక ప్రశాంతతను దూరం చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిజమైన విజయం అంటే మరొకరిని కిందకు తోసేయడం కాదని, అందరినీ గౌరవిస్తూ మన ప్రతిభతో మనం పైకి ఎదగడమేనని వారు చెబుతున్నారు. అనన్యా పాండే వ్యక్తం చేసిన ఈ అభిప్రాయాలు ప్రస్తుతం యువతలో మంచి చర్చకు దారి తీశాయి. ముఖ్యంగా మహిళలు మహిళలకు అండగా నిలబడాలి, పోటీని ద్వేషంగా కాకుండా ప్రేరణగా మార్చుకోవాలి అన్న ఆమె సందేశం ఎంతో మందిని ఆకట్టుకుంటోంది. నేటి యువతలో పెరుగుతున్న అనారోగ్యకరమైన పోటీ తత్వానికి ఇది సరైన సమాధానమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# అభిమాని కోరిక తీర్చిన రామ్..

**వేద న్యూస్ డెస్క్:**



టాలీవుడ్‌లో స్టార్ హీరోల పై అభిమానులు చూపించే ప్రేమ గురించి తరచూ వార్తలు వినిపిస్తూనే ఉంటాయి. అయితే కొన్నిసార్లు హీరోలు అభిమానుల కోసం చేసే చిన్న సహాయమే వారి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతుంది. తాజాగా హీ రో రామ్ పోతినేని చేసిన ఓ మంచి పని ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. తెరపై తన ఉత్సాహభరిత నటన, మాస్ పాత్రలతో అభిమానులను అలరించే రామ్.. ఈసారి తన మానవత్వంతో అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. గత 18 ఏళ్లుగా అరుదైన నరాల సంబంధిత వ్యాధి ‘ఫ్రెడ్రిచ్ అటాక్సియా’తో బాధపడుతున్న ఓ యువతి, తన అభిమాన హీరో రామ్‌ను ఒక్కసారైనా కలవాలని ఎంతోకాలంగా కోరుకుంటున్నట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న రామ్ ఎలాంటి ప్రచారం లేకుండా నేరుగా ఆమె ఇంటికే వెళ్లి పరామర్శించడం ఇప్పుడు అభిమానులను భావోద్వేగానికి గురి చేస్తోంది. యువతితో కొద్దిసేపు ఆప్యాయంగా మాట్లాడి ధైర్యం చెప్పడమే కాకుండా, ఆమె కుటుంబ సభ్యులతో కూడా సమయం గడిపినట్లు సమాచారం. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతున్నాయి. “నిజ జీవిత హీరో అంటే ఇలానే ఉండాలి”, “అభిమానిని ఇంతగా గౌరవించడం గొప్ప విషయం” అంటూ అభిమానులు, నెటిజన్లు రామ్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఫ్రెడ్రిచ్ అటాక్సియా అనేది చాలా అరుదుగా కనిపించే జన్యుపరమైన నరాల బలహీనత వ్యాధి. ఈ వ్యాధి కారణంగా శరీర కదలికల సమన్వయం క్రమంగా దెబ్బతింటుంది. ముఖ్యంగా మెదడు, వెన్నుపాము, నరాల వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది. దీనివల్ల నడవడంలో ఇబ్బందులు, చేతులు కాళ్ల బలహీనత, మాట్లాడటంలో సమస్యలు వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి తీవ్రత పెరిగే కొద్దీ రోజువారీ జీవితం కూడా కష్టతరమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో కూడా తన అభిమాన హీరోను కలవాలనే కోరికను మనసులో పెట్టుకున్న ఆ యువతిని రామ్ స్వయంగా వెళ్లి కలవడం ఇప్పుడు అందరినీ కదిలిస్తోంది. ఆమెతో ఫొటోలు దిగడం, చిరునవ్వుతో మాట్లాడడం వంటి దృశ్యాలు అభిమానుల్లో ప్రత్యేకమైన అనుభూతిని కలిగిస్తున్నాయి. ఇక రామ్ సినిమాల విషయానికి వస్తే, ప్రస్తుతం ఆయన తన 23వ చిత్రంపై దృష్టి సారించారు. “ఒంటరి తోడేలు కథ” అనే నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ మానసిక యాక్షన్ థ్రిల్లర్ చిత్రంపై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కానున్నట్లు సమాచారం.

# ‘డ్రాగన్’లో బాలీవుడ్ నటుడు



**వేద న్యూస్ డెస్క్:**

జూనియర్ ఎన్టీఆర్ హీరోగా దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం ‘డ్రాగన్’ ఇప్పటికే దేశవ్యాప్తంగా సంచలన చర్చకు దారి తీస్తోంది. భారీ యాక్షన్ కథాంశంతో రూపొందుతున్న ఈ చిత్రంపై అభిమానుల్లో రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. ఇటీవల విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ముఖ్యంగా ఎన్టీఆర్ మాస్ లుక్, డార్క్ షేడ్స్‌లో కనిపించిన తీరు, యాక్షన్ విజువల్స్ అభిమానులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ప్రశాంత్ నీల్ మార్క్ టేకింగ్ మరోసారి తెరపై చూడబోతున్నామనే ఉత్సాహం ఈ చిత్రంలో కీలకమైన పాత్ర కోసం మొదట మలయాళ స్టార్ హీరో టోవినో థామస్‌ను ఎంపిక చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే సినిమా కోసం ఎక్కువ రోజుల కాల్‌షీట్లు అవసరం కావడం, అదే సమయంలో తన ఇతర ప్రాజెక్ట్‌ల షూటింగ్‌లు ఉండటంతో ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. టోవినో స్థానంలో ఇప్పుడు బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ గుప్తాను ఎంపిక చేసినట్లు సమాచారం. ‘జుబిలీ’, ‘ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్’ వంటి వెబ్ సిరీస్‌లతో మంచి గుర్తింపు తెచ్చుకున్న సిద్ధాంత్ గుప్తా, ఈ సినిమాతోనే తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నట్లు తెలుస్తోంది. సినిమాలో ఆయన ‘బాబీ సర్కార్’ అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఆఫ్ఘన్ ట్రేడింగ్ నెట్‌వర్క్‌కు సంబంధించిన కీలక వ్యక్తిగా ఆయన పాత్ర ఉంటుందని, కథలో ఎన్టీఆర్ పాత్రకు అత్యంత దగ్గరగా ఉండే పాత్ర ఇదేనని టాక్ వినిపిస్తోంది. అంతేకాకుండా ఎన్టీఆర్ పోషిస్తున్న ‘లూగర్’ పాత్రకు సోదరుడిగా సిద్ధాంత్ కనిపిస్తాడనే ప్రచారం కూడా సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఎన్టీఆర్ ఈ సినిమాలో అత్యంత క్రూరమైన స్మగ్లింగ్ సిండికేట్‌కు నాయకత్వం వహించే పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. యాక్షన్‌తో పాటు ఎమోషనల్ డ్రామాకూ ఈ సినిమాలో పెద్దపీట వేస్తున్నారని తెలుస్తోంది. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ ‘రఘువీర్ రాథోడ్’ అనే కీలక పాత్రలో నటిస్తుండగా, హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ కనిపించనుంది. మలయాళ నటుడు బిజు మీనన్, సీనియర్ నటి ఖుష్బూ కూడా ఈ సినిమాలో ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సంగీత దర్శకుడు రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కు ఆయన ఇచ్చిన నేపథ్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రశాంత్ నీల్ సినిమాల్లో కనిపించే హై ఇంటెన్స్ యాక్షన్ సన్నివేశాలు, భారీ సెట్లు, అంతర్జాతీయ స్థాయి విజువల్స్ ఈ చిత్రంలో కూడా ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ముఖ్యంగా ఎన్టీఆర్ పాత్రను ఇప్పటివరకు ఎప్పుడూ చూడని విధంగా డిజైన్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. ఒక్కో అప్‌డేట్ బయటకు వస్తున్న కొద్దీ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిమానులు ఇప్పటికే ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది అత్యంత భారీ సినిమాల్లో ఒకటిగా భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 2027 జూన్ 11న విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# చరణ్ గైర్హాజరు.. మెగా వేడుకలో చర్చ

**వేద న్యూస్ డెస్క్:**




మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు కొల్లి బాబీ తెరకెక్కిస్తున్న మెగాస్టార్ కెరీర్ 158వ చిత్రం నేడు ఘనంగా ప్రారంభమైంది. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ‘వాల్తేరు వీరయ్య’ భారీ విజయాన్ని అందుకోవడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ నిర్మాత కే వెంకట నారాయణ ఈ చిత్రాన్ని భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కిస్తున్నారు. పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించగా, సినీ ప్రముఖులు, మెగా కుటుంబ సభ్యులు, పరిశ్రమకు చెందిన పలువురు పెద్దలు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు ఈ వేడుకలో ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెగాస్టార్ చిరంజీవి సినిమాకు పవన్ కళ్యాణ్ తొలి క్లాప్ ఇవ్వగా, ఆ దృశ్యాలు అభిమానులను ఉత్సాహానికి గురి చేశాయి. అలాగే మెగా బ్రదర్ నాగబాబు కూడా కార్యక్రమంలో పాల్గొనడంతో చాలా కాలం తర్వాత మెగా కుటుంబ సభ్యులు ఒకే వేదికపై కనిపించడం అభిమానుల్లో ఆనందాన్ని నింపింది. కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరూ ఈ ప్రాజెక్ట్ టాలీవుడ్‌లో మరో భారీ విజయంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు అయితే ఈ వేడుకకు సంబంధించి ముందుగా వచ్చిన వార్తల్లో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కూడా హాజరవుతారని ప్రచారం జరిగింది. ముఖ్యంగా చిరంజీవి, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్ ఒకే వేదికపై కనిపించే అరుదైన క్షణాలను చూడాలని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూశారు. కానీ అనూహ్యంగా రామ్ చరణ్ కార్యక్రమంలో కనిపించకపోవడంతో అభిమానుల్లో చర్చ మొదలైంది. సామాజిక మాధ్యమాల్లో “చరణ్ ఎందుకు రాలేదు?” అనే ప్రశ్న వైరల్‌గా మారింది ప్రస్తుతం రామ్ చరణ్ తన తాజా చిత్రం ‘పెద్ది’ ప్రమోషన్లలో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. సినిమా విడుదల తేదీ సమీపిస్తుండటంతో వరుస ప్రచార కార్యక్రమాలు, ఈవెంట్లలో పాల్గొంటున్న ఆయనకు కఠినమైన షెడ్యూల్ కొనసాగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే కారణంగా మెగాస్టార్ 158వ చిత్రం ప్రారంభోత్సవానికి హాజరు కాలేకపోయి ఉండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఇక ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ సంగీతం అందిస్తుండగా, విజయ్ కార్తీక్ కన్నన్ ఛాయాగ్రాహకుడిగా పనిచేస్తున్నారు. ఆంటోనీ ఎల్ రూబెన్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. భారీ స్థాయిలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. త్వరలోనే చిత్ర బృందం నటీనటులు, కథాంశం, విడుదల తేదీకి సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటించనుంది. మెగాస్టార్ కొత్త సినిమా ప్రారంభం కావడంతో అభిమానుల్లో ఇప్పటికే భారీ ఉత్సాహం నెలకొంది. ‘వాల్తేరు వీరయ్య’ తర్వాత చిరంజీవి బాబీ కాంబినేషన్ మరోసారి బాక్సాఫీస్‌ను షేక్ చేస్తుందనే నమ్మకంతో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# త్రిష మళ్లీ ఫామ్‌లోకి.. హీరోయిన్ల మధ్య కొత్త పోటీ

**వేద న్యూస్ డెస్క్:**



దక్షిణాది సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్ త్రిష పేరు మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. దాదాపు రెండు దశాబ్దాలుగా తన నటన, అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న త్రిష.. మధ్యలో కొంతకాలం సినిమాలకు దూరంగా ఉన్నారు. ఆ సమయంలో ఆమె రాజకీయాల్లోకి వెళ్లబోతున్నారనే ప్రచారం కూడా జోరుగా సాగింది. దీంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. అయితే ఆ వార్తలన్నీ కేవలం పుకార్లేనని, తన దృష్టి పూర్తిగా సినిమాలపైనే ఉందని త్రిష స్పష్టం చేయడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే విడుదలైన ‘కరుప్పు’ సినిమా త్రిష కెరీర్‌కు మళ్లీ కొత్త ఊపును తీసుకొచ్చింది. తమిళనాడులో ఈ చిత్రం మంచి వసూళ్లు సాధిస్తూ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. దీంతో త్రిష కెరీర్ ముగిసిందని భావించిన విమర్శకులు కూడా ఇప్పుడు ఆమె సక్సెస్‌ను ప్రశంసిస్తున్నారు. ఈ విజయం తర్వాత త్రిష మళ్లీ వరుస సినిమాలతో బిజీ అవుతారా.. లేక ఎంపిక చేసిన కథలతో మాత్రమే ముందుకు వెళ్తారా అన్న చర్చ సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. త్రిష ఒకవేళ భవిష్యత్తులో సినిమాలకు విరామం ఇస్తే.. ఆమె స్థానం ఎవరు భర్తీ చేస్తారన్న చర్చ కూడా ఇండస్ట్రీలో మొదలైంది. ప్రస్తుతం కొత్త హీరోయిన్లు ఎంతోమంది వస్తున్నప్పటికీ.. సీనియర్ స్టార్ హీరోయిన్ల స్థాయిలో మార్కెట్‌ను నిలబెట్టుకోవడం అంత సులువు కాదని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో తమన్నా, కాజల్ అగర్వాల్ పేర్లు ముందుగా వినిపిస్తున్నాయి. తమన్నాకు ఇప్పటికీ అవకాశాలు వస్తున్నప్పటికీ.. మహిళా ప్రాధాన్యత ఉన్న సినిమాలను ఒంటరిగా విజయవంతం చేసే స్థాయిలో ఇటీవల ఆమెకు పెద్ద హిట్‌లు రావడం లేదు. మరోవైపు కాజల్ అగర్వాల్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించినప్పటికీ.. ఆశించిన స్థాయిలో మళ్లీ బలమైన మార్కెట్‌ను సొంతం చేసుకోలేకపోయారు. దీంతో త్రిష స్థాయిని పూర్తిగా భర్తీ చేయడం వీరికి అంత సులభం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక త్రిష స్థానం విషయంలో ఎక్కువగా వినిపిస్తున్న మరో పేరు నయనతారది. ఇప్పటికే దక్షిణాదిలో అత్యంత భారీ మార్కెట్ కలిగిన హీరోయిన్లలో నయనతార ముందంజలో ఉన్నారు. ఆమె నటిస్తున్న చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తున్నాయి.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073